శుక్రవారం
14-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 291
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

నేడు జిన్‌పింగ్‌తో లూలా భేటీ
చైనాలో బ్రెజిల్ అధ్యక్షుడి అధికారిక పర్యటన

బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా చైనాలో అధికారికంగా పర్యటిస్తున్నారు. బుధవారం రాత్రి భార్య రొసాంగెలా 'జాంజా' ద సిల్వాతో కలిసి షాంఘై చేరుకున్నారు. అక్కడి విమానాశ్రయంలో చైనా విదేశాంగ శాఖ సహాయ మంత్రి జి ఫెంగ్ వారికి పుష్పగుచ్ఛాలు అందించి ఆత్మీయ స్వాగతం పలికారు.

2లో

'సీదిరి'...చీదర

- తెలంగాణ సీఎం, మంత్రులపై ఘాటు విమర్శలు
- అప్పలరాజుపై ఏపీ సీఎంవో సీరియస్
- మాటలు జాగ్రత్త అంటూ హెచ్చరిక
- ఇలా మాట్లాడితే ప్రజల్లో పలచనవుతామన్న బొత్స

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంలో తెలంగాణ ప్రభుత్వ జోక్యం వైసీపీలో పెనుదుమారం రేపుతోంది. రెండు రాష్ట్రాలకు చెందిన మంత్రుల విమర్శలు, ప్రతి విమర్శలు రాజకీయంగా వేడి పుట్టిస్తోంది. ఏపీ మంత్రి సీదిరి అప్పలరాజు చేసిన ఘాటైన వ్యాఖ్యలు సహచర మంత్రివర్గ సభ్యులను సైతం ఇబ్బందిపెట్టింది. దీంతో సీఎం జగన్ ఆదేశాల

- మిగతా 2 లో

విశాఖ ఉక్కుపై అనిశ్చితి

- ప్రైవేటీకరణ ఆగిందా...లేదా
- ప్రైవేటుకివ్వం...బలపరుస్తామన్న కేంద్రమంత్రి
- కేబినెట్ ప్రకటన చేయాలంటున్న కార్మిక నేతలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:
విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రమంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే స్పష్టత ఇచ్చారా? లేక మరింత గందరగోళంలోకి నెట్టారా? అనే విషయం సందిగ్ధంగా మారింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ఇప్పటికిప్పుడు ముందుకు వెళ్లడం లేదని, దీని పటిష్టత కోసం ఆలోచిస్తున్నామని మంత్రి ప్రకటించారు. ఉక్కు కర్మాగారాన్ని బలోపేతం చేస్తామని, ప్రైవేటుకు అప్పగించాలని ప్రస్తుతానికి అనుకోవడం లేదని కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే గురువారం తెలిపారు. రోజ్‌గార్ మేళా సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. 'ప్రస్తుతానికి ఉక్కు కర్మాగారాన్ని విక్రయించే యోచన లేదు. రాబోయే రోజుల్లో మరింత మెరుగుపరుస్తాం. మైనింగ్ సమస్యలనూ పరిష్కరిస్తాం' అని పోర్టు నగరంలో విలేకరులతో మాట్లాడిన కులస్తే అన్నారు. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)ను బలోపేతం చేసే పనిలో ఉన్నామని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కొత్త విభాగాలు ప్రారంభిస్తున్నామని, ముడిసరుకును పెంపొందించే ప్రక్రియపై దృష్టి పెట్టామని, పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసేలా చూస్తామని అన్నారు.

సీసీఈఏ ప్రకటిస్తేనే నమ్ముతాం: కార్మిక నేతలు

ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర కమిటీ (సీసీఈఏ) అధికారికంగా ప్రకటన చేస్తే తప్ప మంత్రి కులస్తే మాటలను నమ్మేది లేదని విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మిక

- మిగతా 2 లో

లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు
ఏకం కావాలి

- రాజా, ఏచూరి పిలుపు
- బిహార్ సీఎం నితీశ్‌తో భేటీ-విపక్షాల ఐక్యతపై చర్చ

న్యూఢిల్లీ:
లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావడం మన ప్రజాస్వామ్యానికి, ప్రజలకు ఎంతో ముఖ్యమని సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. 2024 లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ప్రతిపక్షాల ఐక్యతకు చర్యలు వేగం పుంజుకున్నాయని, రాష్ట్ర స్థాయిలో సీట్ల సద్దుబాటు జరుగుతుందని అన్నారు. ఇదే క్రమంలో మూడో ఫ్రంట్ ఏర్పాటయ్యే అవకాశాలు లేకపోలేదని ఏచూరి అన్నారు. ఎన్నికల తర్వాతే అది జరుగుతుందన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను కలిసిన వామపక్ష నాయకులు... ప్రతిపక్షాల ఐక్యత, ఉమ్మడి కార్యాచరణపై చర్చించారు. భారతీయ గణతంత్రం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం లౌకిక ప్రజాస్వామ్య పార్టీల ఐక్యతకు చర్యలను నితీశ్ కుమార్ ముందుకు తీసుకెళుతున్నారు. ఆయన బీజేపీ-మోదీ ప్రభుత్వ వేధింపులకు గురయ్యారు. భారత్‌ను, ప్రజల జీవనోపాధి పరిరక్షణకు బీజేపీని ఓడించడం అనివార్యమన్నారు. భేటీ అనంతరం రాజా, ఏచూరి ట్విట్టర్‌లో స్పందించారు. 'జేడీ(యూ) నేత, బీహార్ సీఎం నితీశ్ కుమార్‌ను కలిసి ఆర్ఎస్ఎస్-బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకమయ్యే దిశగా విస్తృతాంశాలను చర్చించాం. దేశం అనిశ్చితి పరిస్థితులను ఎదుర్కొంటోంది. సమాజంలోని అన్ని వర్గాలు బీజేపీ పాలనకు వ్యతిరేకంగా

- మిగతా 2 లో

కోడికత్తి కేసులో
కుట్ర లేదు

- నిందితుడు టీడీపీ సానుభూతిపరుడు కాదు
- ఈ కేసులో దర్యాప్తు అవసరం లేదు
- కోర్టులో కౌంటర్ దాఖలు చేసిన ఎన్ఐఏ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోడికత్తి కేసులో ఎటువంటి కుట్ర లేదని ఎన్ఐఏ తేల్చిచెప్పింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు కాదని స్పష్టం చేసింది. అందువల్ల ఈ కేసులో లోతైన దర్యాప్తు కోరుతూ సీఎం జగన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేయాలని కోరింది. కోడికత్తి కేసుపై ఏఐఏ కోర్టులో గురువారం విచారణ

- మిగతా 2 లో

గ్యాంగ్‌స్టర్ అతీక్ కుమారుడి
కాల్చివేత

- అనుచరుడు కూడా ఎన్‌కౌంటర్
- యూపీ పోలీసుల దుందుడుకు

ఉత్తరప్రదేశ్ లో సంచలనం సృష్టించిన ఉమేశ్ పాల్ హత్య కేసు నిందితుడు, రాజకీయ నేతగా మారిన గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడు అసద్‌ను పోలీసులు గురువారం కాల్చి చంపారు. అసద్‌తో పాటు మరో నిందితుడు గుల్హామ్‌ను కూడా ఎన్‌కౌంటర్ చేశారు.

2 లో

మోదీ గద్దె దిగే వరకు ఉద్యమం

- దేశాన్ని పరిరక్షించుకుందాం
- నేటి నుంచి సీపీఐ-సీపీఎం ప్రచారభేరి
- రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాసరావు
- పోస్టరు ఆవిష్కరించిన నేతలు
- ముఖ్య అతిథులుగా వినయ్ విశ్వం, ప్రకాశ్ కారత్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
మోదీ ప్రభుత్వం గద్దె దిగేవరకు ప్రతిపక్షాలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు స్పష్టంచేశారు. 'మోదీని గద్దె దించండి-దేశాన్ని కాపాడండి' నినాదంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలపై సీపీఐ, సీపీఎం సంయుక్తంగా తలపెట్టిన ప్రచారభేరి ఈనెల 14వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజు నుంచి ప్రారంభమై...15 రోజులపాటు కొనసాగుతుందన్నారు. విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం(ఎంబీవీకే) భవన్‌లో గురువారం సీపీఐ, సీపీఎం నేతలు ప్రచార పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ మతోన్మాద, కార్పొరేట్, ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలని, రాజ్యాంగ, ప్రజాస్వామిక హక్కులను కాపాడాలని, ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరానికి కేంద్రం చేస్తున్న ద్రోహం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రచారభేరికి శ్రీకారం చుట్టామన్నారు. తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం దేశానికి ఏమి చేసిందని ప్రశ్నించారు. సాధారణ ప్రజలకిచ్చిన వాగ్దానాలు ఏమైనా అమలు చేశారా? కార్పొరేట్‌కు ఏ రకంగా మోదీ కొమ్ముకాశారనే దానిపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరముందని ఆయన అన్నారు. 2014 ఎన్నికల ముందు మోదీ పదేపదే రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగుల సమస్యలు, బ్లాక్‌మనీ, అధిక ధరలపై మాట్లాడారని రామకృష్ణ గుర్తుచేశారు. తొమ్మిదేళ్ల తర్వాత కూడా అందులో ఒక్క హామీ అయినా అమలు చేశారా అని నిలదీశారు. 'ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలిస్తామన్నారు. నేడు దానిపై స్పందించడం లేదు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్నారు. రైతుల ఆదాయం పెరిగిందా? ఆత్మహత్యలు ఆగాయా?' అని సూటిగా ప్రశ్నించారు. వీటన్నింటికీ మోదీ సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. ధరల విషయంలోనూ మోదీ ప్రభుత్వం దగా చేసిందని మండిపడ్డారు. ధరల నియంత్రణలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు. నాడు రూ.410 సిలిండరు ధర ఉంటే బీజేపీ నేతలంతా

- మిగతా 2 లో

సుప్రీంలో ఆర్-5 జోన్‌పై
రైతుల పిటిషన్
ఉపసంహరణ

19న హైకోర్టు విచారణ ఉన్నందునే

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
రాజధాని అమరావతిలో ఇతర ప్రాంతాల వారికి ఇళ్లస్థలాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్-5 జోన్‌పై సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను అమరావతి రైతులు గురువారం ఉపసంహరించుకున్నారు. ఇదే అంశంపై ఈనెల 19న హైకోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో సుప్రీంలో వేసిన పిటిషన్‌ను రైతులు వెనక్కి తీసుకున్నారు. ఇందుకు సుప్రీం ధర్మాసనం కూడా అనుమతించింది. ఏపీ హైకోర్టు తీర్పు అనంతరం సుప్రీంకోర్టుకు వెళ్లడంపై అమరావతి రైతులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. తొలుత ఆర్-5 జోన్‌పై

- మిగతా 2 లో

ఇదీ లోకం!



అమ్మో, అంబేద్కర్ జయంతి దండ వేయాల!

అడవికి రక్షణ కరువు

యధేచ్ఛగా కలప అక్రమ రవాణా

- అధికారులే సూత్రధారులు
- పట్టించుకోని ప్రభుత్వ పెద్దలు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు:
ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం అడవులకు రక్షణ కరువైంది. అడవులను రక్షించాల్సిన అటవీశాఖ అధికారులే అడ్డదారులు తొక్కుతున్నారు. అధికారుల అండదండలతో బుట్టాయిగూడెం మండలంలో అరుదైన కలప తరలిపోతోంది. కంచే చేను మేసిన చందంగా ఇక్కడ పరిస్థితి ఏర్పడింది. అధికారుల నిర్లక్ష్యంతో దట్టమైన అటవీ ప్రాంతం మైదానంగా మారిపోయే ప్రమాదం ఏర్పడుతోంది. అటవీశాఖ అధికారుల ధనదాహానికి దట్టమైన అడవులు అంతరించిపోతున్నాయి. అడవుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అటవీ సంపద దోపిడీ నిరాటంకంగా కొనసాగుతోంది. అడపాదడపా కట్టడి చర్యలు చేపట్టినా కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. అక్రమ రవాణాకు సిబ్బంది సహకరిస్తున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు ఉన్నాయి. అటవీ ప్రాంతంలో అడుగడుగునా చెక్ పోస్టులు ఏర్పాటు చేసినా కలప అక్రమ రవాణా ఆగడం లేదు. అక్రమార్కులు అధికారులను

- మిగతా 2 లో

పేదలకు భూ పంపిణీ
అత్యవసరం

వ్యవసాయ కార్మిక సంఘం చర్చా వేదికలో వక్తలు

పేదలకు భూ పంపిణీ సామాజిక అవసరమని, అందుకోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు

8లో

గ్యాస్ సిలిండర్
రూ. 500కివ్వాలి

మహిళా సమాఖ్య రౌండ్‌టేబుల్‌లో వక్తలు

8 లో

స్విట్జర్లాండ్ ఎన్నికలలో కమ్యూనిస్టుల గెలుపు

2023, ఏప్రిల్ 3వ తేదీన స్విట్జర్లాండ్ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ ఎన్నికల్లో స్విట్జర్లాండ్ కమ్యూనిస్టు పార్టీ రెండు స్థానాల్లో గెలుపొందింది. గెలిచిన వారిలో స్విట్జర్లాండ్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి మస్సిమిలియానో అయ్, మరో పొలిట్ బ్యూరో సభ్యులు లియా ఫెరారీ ఉన్నారు. ఇటాలియన్ భాష మాట్లాడే ప్రాంతంలో వీరు గెలిచారు. మొత్తం ఓట్లలో కమ్యూనిస్టులు రెండు శాతం ఓట్లు పొందారు.

2019 ఎన్నికల్లో ఒక సీటు పూర్తి మెజారిటీతో, రెండవ స్థానంలో బహుతక్కువ మార్జిన్‌తో ఇతరుల సహాయంతో గెలిచారు. 2023 ఎన్నికల సరళిని పరిశీలిస్తే రెండు స్థానాల్లో ఓట్ల శాతం గణనీయంగా పెరిగింది. గెలిచిన అన్ని ప్రాంతాల్లోనూ ఓట్ల శాతం పెరగడం విశేషం.

స్విట్జర్లాండ్‌లో పోటీ చేసిన లెఫ్ట్ పార్టీల్లో కమ్యూనిస్టు పార్టీ మాత్రమే విజయాన్ని సాధించింది. ట్రాట్స్కీయిస్టులు, ఇతర పార్టీలు పోటీ చేసినప్పటికీ వామపక్ష పార్టీగా కమ్యూనిస్టు పార్టీయే ప్రత్యేకంగా గెలవడం పరిశీలకుల దృష్టిని ఆకర్షించింది. కమ్యూనిస్టు పార్టీపై ట్రాట్స్కీయిస్టులు, పర్యావరణ సంస్థలు, సోషల్ డెమొక్రాట్లు ఎంతగా విద్వేష ప్రచారాన్ని చేసినప్పటికీ ఆ పార్టీ సూత్రబద్ధ విధానాలకు కట్టుబడి ఉండటం గొప్ప విషయం.

ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో కమ్యూనిస్టులు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అనుకూలంగా ఉన్నారన్న ప్రచారం సాగింది. నాటోకు, యూరోపియన్ యూనియన్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ దృఢ వైఖరిని తీసుకున్నది. స్విట్జర్లాండ్ తటస్థ దేశంగా ఉండాలని ప్రతిపాదనతో కమ్యూనిస్టు పార్టీ ఓటర్ల వద్దకు వెళ్లింది. కమ్యూనిస్టులకు ఓటు వేసిన వారిలో యువరైతులు, తోట కార్మికులు ప్రముఖంగా ఉన్నారు. కమ్యూనిస్టులు స్విట్జర్లాండ్‌ను ఉక్రెయినికీకరణ చేస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగింది. కానీ కమ్యూనిస్టులు స్విట్జర్లాండ్ తటస్థ దేశంగాను, జాతీయ స్వాతంత్ర్యానికి కట్టుబడి ఉన్నామంటూ అన్ని వర్గాల ప్రజల వద్దకు వెళ్లింది. అట్లాంటిక్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నిలబడింది. కార్మిక వర్గంలోనూ రైతాంగంలోనూ కమ్యూనిస్టులకు పలుకుబడి పెరగడం ఈ విజయానికి ప్రధాన కారణం. స్విట్జర్లాండ్ కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల ఫలితాలపై హర్షం వ్యక్తం చేసింది. పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపింది.

దేశభక్తికి, జాతీయవాదానికి మధ్య గీత ఎక్కడ?

యాకోవ్ జ్లోవిన్

దేశభక్తిని ఎలా నిర్వచిస్తాం?

ప్రజలు ఉజ్వల పోరాటాలు నడిపితే గర్వపడతాం. ప్రజలను తక్కువ జాతివారిగా చూస్తే ఆ సూత్రీకరణను ప్రశ్నిస్తాం, ఖండిస్తాం. ప్రజలు స్వాతంత్ర్య సంరక్షణకు ఆయుధాలు చేపడితే అది ఒక గొప్ప పోరాటంగా భావిస్తాం. అదే సమయంలో ఈ భూమండలంపై ఇతర ప్రజలను గౌరవిస్తాం- ఇది దేశభక్తి.

జాతీయవాదమంటే ఏమిటి?

తమ ప్రజలు ప్రత్యేక ఉన్నత జాతిగా భావించే సిద్ధాంతాన్ని సమర్థించడం. సమాజంలో వర్గభేధాలను నిరాకరించడం. మా రక్తం వేరన్న ధోరణిని ప్రవర్తించడం. గొప్ప జాతి వారమని భావించడం- ఈ విధమైన ప్రకటనలు చేస్తూ ఇతరులను న్యూనతభావంగా చూడటం జాతీయవాదానికి తలొగ్గడమే అవుతుంది.

మనం ఒకటి ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి... కమ్యూనిస్టులమైన మేము అంతర్జాతీయ వాదులం, దేశభక్తులం. ఏ రూపంలో ఉన్నప్పటికీ సంకుచిత జాతీయవాదాన్ని ఆమోదించం.

నేడు జిన్‌పింగ్‌తో లూలా భేటీ

చైనాలో బ్రెజిల్ అధ్యక్షుడి అధికారిక పర్యటన

షాంఘై: బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా చైనాలో అధికారికంగా పర్యటిస్తున్నారు. బుధవారం రాత్రి భార్య రొసాంగెలా 'జాంజా' డ సిల్వాతో కలిసి షాంఘై చేరుకున్నారు. అక్కడి విమానాశ్రయంలో చైనా విదేశాంగ శాఖ సహాయ మంత్రి జి ఫెంగ్ వారికి పుష్పగుచ్ఛాలు అందించి ఆత్మీయ స్వాగతం పలికారు. లూలా శుక్రవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో బీజింగ్‌లో భేటీ కానున్నారు. ఆయన శనివారం వరకు చైనాలో పర్యటిస్తారు. లూలా పర్యటనతో ఆసియా దిగ్గజం, లాటిన్ అమెరికాలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ మధ్య ఇప్పటికే బలంగా ఉన్న సంబంధాలు మరింత పటిష్టమవుతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు, ఆర్థిక వ్యవస్థలు కలిగిన చైనా, బ్రెజిల్ మధ్య రాజకీయ, ఆర్థిక సంబంధాలతో పాటు ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త శకాన్ని ఈ పర్యటనతో రెండు దేశాలు ఆవిష్కరిస్తాయన్న అంచనా ఉంది. లూలా చైనాకు బయల్దేరు ముందు బ్రెజిల్‌లో విలేకరులతో మాట్లాడారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను తమ దేశానికి ఆహ్వానించాలని భావిస్తున్నట్లు తెలిపారు. తమ మధ్య సంబంధాలను మరింత పటిష్టపర్చుకునేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ద్వైపాక్షిక భేటీ కోసం జిన్‌పింగ్‌ను ఆహ్వానిస్తానని, చైనా పెట్టుబడుల కోసం ఆసక్తికరంగా ఉండే ప్రాజెక్టులను ఆయనకు చూపుతానని లూలా తెలిపారు. లూలా మార్చి చివరిలోనే చైనాలో పర్యటించాల్సి ఉండగా న్యూమోనియా బారిన పడిన కారణంగా ఆయన తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. బ్రెజిల్ అధ్యక్షుడిగా లూలా చైనాలో పర్యటించడం ఇది మూడోసారి. బ్రెజిల్ పక్షంతో కలిసి పనిచేసేందుకు చైనా ఆసక్తిగా ఉందని ఆ దేశ విదేశాంగ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ అన్నారు. వర్ధమాన దేశాల సంఘీభావం, సహకారం, ప్రపంచ సవాళ్లపై ఉమ్మడి ప్రతిస్పందనకు మరింత సానుకూల శక్తిని సమకూర్చేందుకు యత్నించాలని భావిస్తున్నాయన్నారు. షాంఘైలో బ్రెజిల్ మాజీ అధ్యక్షులు దిల్మా రౌసెఫ్ హెడ్‌గా బ్రిక్స్ నూతన అభివృద్ధి బ్యాంక్ ప్రారంభోత్సవంలో లూలా పాల్గొనున్నారు. ఈ పర్యటన సందర్భంగా దాదాపు 20 ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు జరుగుతాయని భావిస్తున్నారు.

గ్యాంగ్‌స్టర్ అతీక్ కుమారుడి కాల్చివేత

లక్నో/ఝాన్సీ: ఉత్తరప్రదేశ్ లో సంచలనం సృష్టించిన ఉమేశ్ పాల్ హత్య కేసు నిందితుడు, రాజకీయ నేతగా మారిన గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడు అసద్‌ను పోలీసులు గురువారం కాల్చి చంపారు. అసద్‌తో పాటు మరో నిందితుడు గుల్హామ్‌ను కూడా ఎన్‌కౌంటర్ చేశారు. ఝాన్సీలో రాష్ట్ర స్పెషల్ టాస్క్ ఫోర్స్ జరిపిన ఎన్‌కౌంటర్‌లో వారిద్దరు హతమయ్యారు. ఘటనాస్థలంలో అధునాతన విదేశీ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉమేశ్‌పాల్ హత్య కేసులో విచారణ నిమిత్తం అతీక్ అహ్మద్‌ను గురువారం ప్రయాగ్‌రాజ్ కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. అదే సమయంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం విశేషం. 2005లో బీఎస్పీ శాసనసభ్యుడు రాజుపాల్ హత్యకేసులో ప్రధానసాక్షి ఉమేశ్ పాల్ ఫిబ్రవరి 24న దారుణహత్యకు గురయ్యాడు. ఆయనతో పాటు ఇద్దరు అంగరక్షకులను హంతకులు పట్టపగలే కాల్చి చంపారు. ఉమేశ్ పాల్ హత్యకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. ఉమేశ్ భార్య జయ పాల్ ఫిర్యాదు మేరకు ఈ కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మాజీ ఎంపీ, గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రఫ్, ఇద్దరు కుమారులు, ఇద్దరు అనుచరులు, మరో తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. ఉమేశ్‌పాల్ హత్యకేసులో అతీక్ అహ్మద్ కుమారుడు అసద్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు. ఈ హత్య తర్వాత నుంచి అసద్, అతీక్ అనుచరుడు గుల్హామ్ అదృశ్యమయ్యారు. దీంతో గాలింపు చేపట్టిన పోలీసులు...వీరిపై రూ.5లక్షల చొప్పున రివార్డు కూడా ప్రకటించారు. వీరిద్దరూ ఝాన్సీలో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అరెస్టు చేసేందుకు వెళ్లారు. అక్కడ పోలీసులు, నిందితుల మధ్య ఎన్‌కౌంటర్ చోటుచేసుకొంది. ఉమేశ్‌పాల్ హత్య కేసులో ఓ షార్ప్ షూటర్, మరో నిందితుడిని కొన్నాళ్ల క్రితమే యూపీ పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. 2004లో జరిగిన అసెంబ్లీ ఉపఎన్నికలో రాజుపాల్ అలహాబాద్ (పశ్చిమ) స్థానం నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో అతీక్ అహ్మద్ తమ్ముడు ఖలీద్ అజీమ్‌పై విజయం సాధించారు. అయితే ఈ ఎన్నికలు జరిగిన కొన్ని నెలలకే రాజుపాల్ దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ ప్రస్తుతం గుజరాత్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. రాజుపాల్ హత్య కేసులో ఉమేశ్‌పాల్ ప్రధాన సాక్షిగా ఉన్నారు. గతంలో ఉమేశ్‌పాల్‌ను అతీక్ అహ్మద్ అనుచరులు ఓసారి కిడ్నాప్ చేశారు. దర్యాప్తు కొనసాగుతుండగానే ఉమేశ్‌ను దారుణంగా హత్య చేయడం రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపింది. ఉమేశ్‌పాల్ కిడ్నాప్ కేసులో అతీక్ అహ్మద్‌కు ఇటీవల ప్రయాగ్‌రాజ్ కోర్టు జీవిత ఖైదు విధించింది.

అడవికి రక్షణ కరువు

(మొదటిపేజీ తరువాయి)

తమ గుప్పెట్లో పెట్టుకొని అడవులను స్మగ్లింగ్‌కు అడ్డాగా మార్చుకుంటున్నారు. కోట్లకు పడగలెత్తుతున్నారు. సహజంగా వృక్ష సంపదను సంరక్షించాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారులపై ఉంది. కానీ మచ్చుకైనా పర్యవేక్షణ కానరాదు. అక్రమార్కులు పచ్చని అడవిని నాశనం చేస్తూ విలువైన చెట్లు నరికేస్తున్నారు. వేలేరుపాడు, బుట్టాయిగూడెం మండల సరిహద్దు మోదెల గ్రామం, దొర మామిడి గ్రామపంచాయతీ రేపల్లె గ్రామాలలోని అటవీ ప్రాంతంలో రెండు వేల టేకు చెట్లను కిందిస్థాయి సిబ్బంది కూలీలతో నరికించి ఈ గ్రామాలలో భారీగా నిలువ చేశారు. వీటిలో నల్ల మద్ది, రేవడి, కరగ, కొండ తంగేడు తదితర జాతులు ఉన్నాయి. దీని విలువ రూ.3 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ విషయం రేంజ్ స్థాయి అధికారులకు తెలిసినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. స్వయానా అటవీశాఖ అధికారులే దగ్గరుండి అడవిని నరికించి... ఈ నేరాన్ని కొండరెడ్లపై వేస్తున్నారని గిరిజనులు చెబుతున్నారు. రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు సక్రమంగా లేని ఈ మారుమూల గ్రామాలలో అక్రమార్కులు తిష్టవేసి ఇష్టారాజ్యంగా కలపను దోచుకుంటున్నారు. కలప రవాణా కోసం తారు రోడ్డు సైతం నిర్మించారని స్థానికులు ఆరోపించారు. గిరిజనుల కోసమే రోడ్డు నిర్మించినట్లు అధికారులు నమ్మబలుకుతున్నారు. కొంతమంది అటవీశాఖ అధికారులు దగ్గరుండి రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు గ్రామస్తులు చెప్పారు.

ప్రస్తుతం బదిలీ అయిన నాటి జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు వేలేరుపాడు, బుట్టాయిగూడెం సరిహద్దు ప్రాంతం కొయిదా గ్రామాన్ని మార్చి 28న సందర్శించారు. డోలుగండి నుంచి మొదేలు గ్రామం వరకూ దారి పొడవునా చెట్లు నరికి ఉండటాన్ని గమనించారు. దీనిపై విచారణకు ఆదేశించారు. ఇటీవల రాజమహేంద్రవరం ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ త్రిమూర్తులురెడ్డి కూడా తనిఖీ చేశారు. నరికిన చెట్లను గుర్తించి లెక్కించాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. దీనికి సంబంధించి ఇప్పటివరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

విద్యుత్ సౌకర్యానికి మోకాలడ్డు

డోలుగండి నుంచి మోదేలు గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ 2021లో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రూ.70 లక్షల నిధులు మంజూరు చేసింది. విద్యుత్ శాఖ అధికారులు 6.3 కేవీ సామర్థ్యంతో బుట్టాయిగూడెం మండలం రేపల్లె నుంచి సుమారు 8 కిలోమీటర్ల మేర సింగిల్ లైన్ వేసేందుకు సర్వే చేశారు. ఈ ప్రదేశం జంగారెడ్డిగూడెం, కుక్కునూరు అటవీ రేంజ్ పరిధిలోకి వస్తుంది. రెండు రేంజ్‌ల పరిధిలో అనుమతుల కోసం ప్రయత్నాలు చేసినా అనుమతులు మంజూరు కాలేదు. రహదారికి రెండువైపులా ఉన్న అటవీ ప్రాంతం జంగారెడ్డిగూడెం, కుక్కునూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఆ దారిలో పెద్ద చెట్లు ఉండడంతో అటవీశాఖ అధికారులు అనేక ఆటంకాలు కల్పిస్తూ పనులు జరగకుండా నిలిపివేశారు. కానీ కలప అక్రమ రవాణా మాత్రం యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అటవీశాఖలో ఉన్నతాధికారి నుంచి క్రిందిస్థాయి అధికారుల వరకు మామూలు మత్తులో జోగుతున్నారు. ప్రతిదానికీ ఓ రేటు నిర్ణయించి...బాహాటంగా వసూలు చేస్తున్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో కలప పెంచడానికి, విక్రయించడానికి ప్రభుత్వం నుంచి అనుమతి పొందాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు అమలు చేయాలి. కలపను పెంచాలన్నా, విక్రయించాలన్నా స్థానిక అటవీ రేంజ్ అధికారిని సంప్రదించి దరఖాస్తులు సమర్పించడం ద్వారా అనుమతులు పొందాలి. దరఖాస్తులో పండించే ప్రదేశం, పరిమాణం వంటి వివరాలు, భూమి యాజమాన్యం, రుజువు పత్రాలు సమర్పించాలి. అటవీ ఉత్పత్తుల పెంపకం, వ్యాపారాన్ని నియంత్రించే భారతీయ అటవీ చట్టానికి కట్టుబడి ఉండాలి. కానీ ఈ నిబంధనలు అమలు జరిగిన దాఖలాలు లేవు. జిల్లా యంత్రాంగం తక్షణం స్పందించి కలప దొంగల నుంచి అడవులను కాపాడాల్సిన అవసరం ఉంది.

రాస్తే రాసుకోండి

కలప అక్రమ రవాణాపై సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా 'మీ ఇష్టం వచ్చినట్లు రాసుకోండి. మీకు, ఈ మండలానికి ఏమి సంబంధం? ఏం చేయాలో మాకు తెలుసు' అని అధికారులు లెక్కలేకుండా మాట్లాడుతున్నారు.

లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. మన ప్రజాస్వామ్యాన్ని, పౌరులను రక్షించుకోవడం కోసం లౌకిక-ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావడం తక్షణావశ్యం' అని రాజా ట్వీట్ చేశారు. కేరళలో తమకు, కాంగ్రెస్‌కు మధ్య భీకర పోరు ఉంటుందని, బీజేపీకి అక్కడ అవకాశమే ఉండదని ఏచూరీ పేర్కొన్నారు. మూడవ ఫ్రంట్ అవకాశాలు లేకపోలేదని చెప్పిన ఆయన అది జరిగితే ఎన్నికల తర్వాతే అని అన్నారు. దేశంలో ఎన్నికల తర్వాత ఫ్రంట్లు ఏర్పాటు కావడం కొత్తేమీ కాదని అన్నారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్, 1998లో ఎన్డీయే, 2004లో యూపీఏ... ఎన్నికల తర్వాత ఏర్పాటు కావడాన్ని ఏచూరి గుర్తుచేశారు. నితీశ్ కుమార్ ఇంతకుముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతోనూ భేటీ అయి ప్రతిపక్షాల ఐక్యతపై చర్చించారు.

విపక్షాల ఐక్యతపై పవార్-ఖర్గే భేటీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్ గురువారం సాయంత్రం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆయన నివాసంలో కలిసి ప్రతిపక్షాల ఐక్యతా నిర్మాణంపై భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు. వీరి సమావేశంలో రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నట్లు తెలిసింది. బీహార్ సీఎం నితీశ్ కుమార్, ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కూడా ఖర్గే, గాంధీతో భేటీ అయిన క్రమంలో పవార్ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా విపక్షాలు ఏకమవుతున్న సంగతి తెలిసిందే.

విశాఖ ఉక్కుపై అనిశ్చితి

(మొదటిపేజీ తరువాయి)

సంఘాల నాయకులు తేల్చిచెప్పారు. ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలని నిర్ణయించిన సీసీఈఏనే...దీని నుంచి వెనక్కి వస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. 'ప్రైవేటీకరణ ప్రణాళికకు వ్యతిరేకంగా 800 రోజులుగా ఆందోళన చేస్తున్నాం. రాష్ట్రంతో పాటు తెలంగాణ ప్రజల నుంచి పోరాటానికి మద్దతు ఉంది' అని నాయకులు చెప్పారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగనివ్వబోమని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించినప్పటికీ, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ లేక విశాఖ స్టీల్‌ప్లాంట్ విక్రయానికి విలువ కట్టేందుకు న్యాయ సలహాదారులను కేంద్రం నియమించింది. వెంటనే ఈ ప్రక్రియ మొత్తం ఆగిపోవాలని, అది జరిగితే మంత్రి కులస్తే ప్రకటనను నమ్ముతామని జేఏసీ నేతలు తేల్చిచెప్పారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అధ్వర్యంలో నాయకుల బృందం నొవాటల్ హోటల్‌లో కేంద్రమంత్రి కులస్తేని కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం విలేకరులతో నాయకులు మాట్లాడుతూ ఒక్కోమంత్రి ఒకోలా ప్రకటనలు చేస్తున్నారని, కేంద్ర మంత్రి ప్రకటన...ఉదయానికి సాయంత్రానికి మారిపోయిందన్నారు. ఈ ప్రకటనలు ప్రజలను ఆందోళనకు గురి చేయడానికేనని నేతలు వ్యాఖ్యానించారు. గురువారం మధ్యాహ్నం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, యూనియన్ ప్రతినిధులతో జరిపిన సమావేశంలో మంత్రి ప్రకటన సారాంశం మారిపోయిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి రాకుండా అడ్డుకుంటున్నది కేంద్రప్రభుత్వమేనని ఆరోపించారు. ఖాయిలా పరిశ్రమగా చిత్రీకరించి మూసివేసేందుకు కేంద్రం మొదటి నుంచి కుట్ర చేస్తున్నదని జేఏసీ చైర్మన్, ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ విమర్శించారు. పూర్తిస్థాయి ఉత్పత్తి జరగనివ్వకుండా ప్లాంట్‌ను ఆర్థికంగా దెబ్బతీస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బ్లాస్ట్ ఫర్నేస్‌ను మూసివేసి ముడిసరుకు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వడం లేదన్నారు. రైల్వే రేక్స్‌ను అడ్డుకుంటోందని, సొంత గనులు ఇవ్వలేదన్నారు. మరి లాభాలు ఎక్కడ నుంచి వస్తాయని ప్రశ్నించారు. దేశంలోని ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌లకు కేటాయించినట్లు వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి, దీనిని పూర్తి సామర్థ్యంతో కేంద్రం నడిపిస్తే కచ్చితంగా లాభాలు వస్తాయన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ఎంపీలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై వెనక్కి తగ్గేది లేదని, ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగుతుందని ప్రకటించారని గుర్తుచేశారు. ఇప్పుడు కేంద్రమంత్రి ప్రకటన ప్రజలను మరోసారి వంచించే ఎత్తుగడగా ఉందని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్లు కేంద్రమంత్రివర్గం వెంటనే ప్రకటన చేయాలని, స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించి, ప్లాంట్‌ని పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు జేఏసీ నేతలు తెలిపారు.

రైతుల పిటిషన్ ఉపసంహరణ

(మొదటిపేజీ తరువాయి)

రైతులు హైకోర్టును ఆశ్రయించి దీనిపై ప్రభుత్వం ఇచ్చిన జీవో 45ను కొట్టేయాలని కోరారు. దానికి ప్రభుత్వం నిరాకరించడంతో కనీసం స్టే ఇవ్వాలని అభ్యర్థించారు. కానీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో రైతులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈలోగా హైకోర్టులో ఆర్- 5 జోన్‌పై మరోసారి విచారణ జరిగింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈనెల 19కి హైకోర్టు వాయిదా వేసింది. దీంతో ఆర్-5 జోన్‌పై సుప్రీంలో వేసిన పిటిషన్‌ను అమరావతి రైతులు వెనక్కి తీసుకున్నారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసే సమయానికి హైకోర్టు ఉత్తర్వులు విడుదల కాలేదని, ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయని జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం దృష్టికి రైతుల తరపు సీనియర్ న్యాయవాది శ్యాందివాన్ తీసుకెళ్లారు. శ్యాందివాన్ వాదనతో ఏకీభవించిన సర్వోన్నత న్యాయస్థానం సంబంధిత పిటిషన్ వెనక్కి తీసుకునేందుకు అనుమతించింది. రాష్ట్ర హైకోర్టు తీర్పు తరువాత మళ్లీ సుప్రీంకోర్టుకు వచ్చేందుకు అవకాశం కల్పించింది. ఆర్ 5 జోన్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రైతులు దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే విషయంపై 19న హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణ జరపనుంది. దీనిపై అడ్వకేట్ జనరల్ సుధాకర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై సుప్రీంకోర్టు సానుకూలత వ్యక్తం చేసిందని, రాజధానిలో ప్రభుత్వం పేదలకు సెంటు భూమి చొప్పున ఇంటిస్థలం ఇస్తే మీకు నష్టం ఏముందని పిటిషనర్‌ను సుప్రీం ప్రశ్నిస్తూ, దీనిపై హైకోర్టుకు వెళ్లాలని సూచించడంతో పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నట్లు మీడియాకు తెలిపారు.

కుట్ర లేదు

(మొదటిపేజీ తరువాయి)

జరగ్గా, నిందితుడి తరపు న్యాయవాది అబ్దుస్ సలీం కౌంటర్ దాఖలు చేశారు. ఈ కేసును కుట్రకోణంలో విచారించేలా ఆదేశించాలని కోరుతూ సీఎం జగన్ గతవాయిదాలో దాఖలు చేసిన పిటిషన్‌పై సలీం కౌంటర్ దాఖలు చేశారు. జాతీయ దర్యాప్తు సంస్థ పీపీ విశాల్ గౌతమ్ కూడా కౌంటర్ వేశారు. ఈ కేసులో కుట్రకోణం ఏదీ లేదని సుదీర్ఘ దర్యాప్తు తర్వాత తేలిందని ఎన్ఐఏ స్పష్టం చేసింది. విమానాశ్రయంలోని రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ ప్రసాద్‌కు ఈ సంఘటనతో సంబంధం లేదని వెల్లడించింది. విశాఖ ఎయిర్‌పోర్టులో దాడి జరిగినప్పుడు సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్ చౌదరి అని జగన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారని, అవి రెండు అవాస్తవాలని తెలియజేసింది. సీసీ ఫుటేజ్‌ను తాము పరిశీలించామని, ఆయన పేరు హర్షవర్ధన్ ప్రసాద్ మాత్రమేనని తెలిపారు. దీనిపై ఇప్పటికే కోర్టులో విచారణ ప్రారంభమైనందున ఇక దర్యాప్తు అవసరం లేదని తెలిపింది.

ఈ కేసులో తమ వాదనలు వినిపించేందుకు మరో రెండు రోజుల సమయం కావాలని జగన్ తరపు న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు కోరడంతో... న్యాయమూర్తి కేసు విచారణను ఈనెల 17కు వాయిదా వేశారు. 17న వాదనలు చెప్పాలని... అదే రోజు తీర్పు ఇవ్వనున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. ఇప్పటికే నాలుగు సంవత్సరాలుగా శ్రీనివాసరావు జైలు జీవితం గడుపుతున్నందున ఇంకా వాయిదాలు వేయవద్దంటూ నిందితుడి తరపు న్యాయవాది న్యాయమూర్తిని అభ్యర్థించారు. ఈ నెల 17కే కదా వాయిదా వేసిందని న్యాయమూర్తి సమాధానం ఇచ్చారు. ఈనెల 17న కోర్టు నిర్ణయం ఎలా ఉంటుందనే దానిపై ఉత్కంఠత నెలకొంది.

టీఎస్‌ఆర్టీసీ రాయితీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హైదరాబాద్-విజయవాడకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ రాయితీ సౌకర్యం కల్పించింది. హైదరాబాద్-విజయవాడ మార్గంలో 10శాతం రాయితీ ఏర్పాటు చేసింది. ఈ నెల 30వరకు 10శాతం రాయితీ అమలులో కొనసాగుతుందని టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడించారు. ఈ మార్గంలో నడిచే సూపర్ లగ్జరీ, రాజధాని ఏసీ సర్వీసుల్లో రానుపోనూ ఈ రాయితీ ఉంటుంది. విజయవాడ మార్గంలో రద్దీని దృష్టిలో ఉంచుకుని, వారికి ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రాయితీ వల్ల ప్రతి ప్రయాణికుడికి రూ.40 నుంచి రూ.50వరకు ఆదా అవుతుంది. రాయితీ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, విజయవాడ నుంచి హైదరాబాద్ మార్గాల్లో వెళ్లే ప్రయాణికులకే ఈ రాయితీ ఉంటుంది. ఇందుకోసం టీఎస్ వెబ్‌సైట్లలో రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది.

'సీదిరి'...చీదర

(మొదటిపేజీ తరువాయి)

మేరకు సీఎంవో మంత్రి సీదిరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రి హోదాలో ఉన్నప్పుడు మాటలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. తొలుత మంత్రి బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, తెలంగాణ మంత్రి హరీశ్‌రావు మధ్య విమర్శలు చోటుచేసుకున్నాయి. దీనిపై మంత్రి సీదిరి అప్పలరాజు స్పందిస్తూ హరీశ్‌రావు విమర్శలకు కౌంటర్ ఇచ్చే క్రమంలో అందరికంటే ఎక్కువగా తీవ్ర పదజాలం ప్రయోగించారు. హరీశ్‌రావు కూడా తన మామ కేసీఆర్ లాగా ఫాంహౌస్‌లో కూర్చుని కల్లుతాగిన కోతిలా మాట్లాడుతున్నారని, తమ దగ్గర లిక్కర్ స్కామ్‌లు వంటివి లేవని మంత్రి అప్పలరాజు విమర్శించారు. అలాంటి చాట్లు కూడా లేవంటూ కవిత చాటింగ్‌ను గుర్తుచేశారు. మాట్లాడేముందు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హరీశ్‌రావుపై సీదిరి రెచ్చిపోయారు. సిగ్గూఎగ్గూ లేకుండా ప్రైవేటీకరణ చేస్తే బిడ్ వేస్తామంటారా అని ప్రశ్నించారు. ప్రైవేటీకరణకు నువ్వు అనుకూలమా? వ్యతిరేకమా? అని నిలదీశారు. బంగారు తెలంగాణ అంటూ రాష్ట్రం తెచ్చుకుని దొరల పాలనలో ఏం జరుగుతుందో తెలియదా అని మంత్రి సీదిరి ధ్వజమెత్తారు. నువ్వో మంత్రి, నీ మామ ముఖ్యమంత్రి, ఆయన కొడుకో మంత్రి...మీరంతా ప్రాంతీయ ఉగ్రవాదులు. ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టి నాయకులయ్యారు. పనికిమాలిన మాటలు ఆపి పనిచూసుకోండని హెచ్చరించారు. ఆంధ్రా వాళ్లు తెలంగాణ రావడం మానేస్తే అడుక్కు తినడం తప్ప అక్కడ ఏమీ ఉండదన్నారు. తెలంగాణ వాళ్లు బుర్ర తక్కువ వాళ్లు అంటూ వ్యాఖ్యానించారు. టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మారిస్తే జాతీయ పార్టీ అయిపోతుందా? అసలు దానిలో ఏ కోశానైనా జాతీయవాదం ఉందా అని ప్రశ్నించారు. ఏపీలో ప్రజాశాంతి పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి పెద్ద తేడా ఏమీ లేదని ఎద్దేవా చేశారు. మీ రాజకీయాలు ఏపీలో పనిచేయవని హితవు చెప్పారు. ఇవేకాకుండా రాయకూడని భాషలో మంత్రి పరుష పదజాలం ప్రయోగించారు. ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయవర్గాల్లో సంచలనం సృష్టించింది. పరుష పదజాలంతో మంత్రి అప్పలరాజు చేసిన ఈ వ్యాఖ్యలపై ఏపీ ముఖ్యమంత్రి కార్యాలయం తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇకపై ఇలాంటి పరుష వ్యాఖ్యలు చేయొద్దని సూచించినట్లు సమాచారం. ఎవరిపైన అయినా కామెంట్లు చేసే ముందు జాగ్రత్తగా మాట్లాడాలని సీఎంవో హెచ్చరించినట్లు తెలిసింది. ఇదే అంశంపై సీనియర్ మంత్రి బొత్స సత్యనారాయణ కూడా మంత్రి అప్పలరాజు అలా మాట్లాడి ఉంటే సరికాదని ఖండించారు. బాధ్యత గల వ్యక్తులు నోటికి వచ్చినట్లు మాట్లాడకూడదని, అలా మాట్లాడితే ప్రజల్లో పలచన అవుతామని వ్యాఖ్యానించారు.

మోదీ గద్దె దిగే వరకు ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

గ్యాస్‌బండలు భుజాలపై వేసుకుని దిల్లీ నడివీధుల్లో ధర్నాలు చేశారని, ఇవాళ రూ.1200కు పెరిగితే ఆ నాయకులు ఎందుకు పెదవి విప్పడం లేదని దుయ్యబట్టారు. పెట్రోలు, డీజిల్ ధరలు రూ.100 పైగా పెరిగాయని, నిత్యావసర ధరలు భారీగా పెరిగినప్పటికీ మోదీ నుంచి మంత్రుల వరకు మాట్లాడటం లేదని విమర్శించారు. బ్లాక్‌మనీని వెనక్కి రప్పించకపోగా, బ్యాంకుల్లో వేల కోట్ల రూపాయలు అప్పులు తీసుకుని వాటిని ఎగ్గొట్టి విదేశాలకు దర్జాగా పోతుంటే కేంద్రం చోద్యం చూస్తోందన్నారు. వాళ్లలో గుజరాత్ బడాబాబులే అధికంగా ఉన్నారని గుర్తుచేశారు. మోదీ, అమిత్‌షాకు వారంతా ఆప్తమిత్రులుగా ఉన్నారన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు కొమ్ము కాస్తోందని, అదానీ, అంబానీ ఆస్తులు పెంచేందుకు తోడ్పడుతోందని దుయ్యబట్టారు. పేదలు, రైతులు, నిరుద్యోగులు, సాధారణ ప్రజల సమస్యల పరిష్కారంలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వేజోన్‌కు నిధులు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అదానీకి కట్టబెట్టేందుకు మోదీ, జగన్ లాలూచీపడ్డారని మండిపడ్డారు. మోదీ ప్రజావ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ ప్రచారానికి శ్రీకారం చుట్టామని, దీని తర్వాత ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని ప్రకటించారు.

శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ అరాచక పాలన కొనసాగుతోందని, మోదీ దుష్ట పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పేర్లతో అమిత్‌షా బృందం మత కల్లోలాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. పరస్పరం ద్వేషించుకునేలా, దేశ సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధంగా బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ మతం పేరుతో ఘర్షణలు సృష్టిస్తూ దేశాన్ని బలహీనపరిచే చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా దేశ పరువు, ప్రతిష్ఠలను మంట గలుపుతోందన్నారు. పశ్చిమబెంగాల్‌లో నేటికీ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని వివరించారు. చత్తీస్‌గఢ్ బస్తర్ జిల్లాలో బీజేపీ, ఆరెస్సెస్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు క్రైస్తవులను సామాజిక, ఆర్థిక బహిష్కరణకు గురిచేసిన సంఘటన సమాజం తలదించుకునేలా ఉందని వ్యాఖ్యానించారు. అదానీ వేల కోట్ల రూపాయల కుంభకోణంపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా మోదీ సర్కారు అడ్డుకుందని ఆరోపించారు. అదానీని రక్షించడానికి, మోదీ సర్కారు వైఫల్యాలను పక్కదారి పట్టించడానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొడుతున్నాయని మండిపడ్డారు. మోదీ హయాంలో ఇన్ని దారుణాలు జరుగుతున్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పక్షపాతిగా చెప్పుకుంటున్న సీఎం జగన్ ఎందుకు స్పందించడం లేదని, బీజేపీని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో ఆరెస్సెస్ కార్యకలాపాలు విస్తృతంగా కొనసాగుతున్నాయని, పాఠశాలల్లో పిల్లల మనసుకు ఇబ్బంది కలిగే చర్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యావిధానాన్ని ప్రక్షాళన చేస్తున్నానంటూ జగన్ గొప్పలు చెప్పుకుంటున్నారని, బీజేపీ, ఆరెస్సెస్ విధానాలపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడంలో భాగంగా పెట్టుబడులు రాకుండా, ముడిసరుకు సరఫరా చేయకుండా, బ్యాంకులు సాయం చేయకుండా కేంద్ర ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై మంత్రి గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పందించిన తీరు అవగాహన లోపంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నిర్వీర్యం చేస్తున్నాయని, ఇది దుర్మార్గమని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా సీఎం జగన్ మేల్కొని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం దిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం జాతీయ సమితి పిలుపులో భాగంగా విజయవాడ ఎంబీవీకేలో ఈనెల 14వ తేదీన ప్రచారభేరి ప్రారంభసభ జరుగుతుందన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి, అనంతరం ర్యాలీగా ఎంబీవీకే వద్దకు చేరుకుంటామని తెలిపారు.

రాష్ట్రానికి బీజేపీ, ఆరెస్సెస్, విశ్వహిందూ పరిషత్ చేస్తున్న అన్యాయాన్ని, కుట్రలను ఎండగడతామని చెప్పారు. ప్రచారభేరి ప్రారంభసభకు సీపీఐ, సీపీఎం జాతీయ నేతలు వినయ్‌విశ్వం, ప్రకాశ్ కారత్ హాజరవుతారని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సీహెచ్.బాబూరావు, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చైతన్యం ద్వారానే బహుజనులకు రాజ్యాధికారం

- సమాజ మార్పు కోసం కలిసివచ్చే శక్తులను కూడగట్టాలి
- డీహెచ్‌పీఎస్ సెమినార్‌లో వక్తలు

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రజా చైతన్యం ద్వారానే బహుజనులు రాజ్యాధికారం సాధించుకోవచ్చని వక్తలు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో గురువారం భారత రాజ్యాంగం, బహుజన రాజ్యాధికారం, అవకాశాలు, అవరోధాలు, మన కర్తవ్యం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ కలెక్టర్ దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం కలిసివచ్చే అన్ని శక్తులను కూడగట్టాలని అంబేద్కర్ ఏనాడో చెప్పారని తెలిపారు. చరిత్రను వక్రీకరించటం ఎవరివల్ల సాధ్యం కాదన్నారు. వక్రీకరించినంతమాత్రాన చరిత్ర మారదని అన్నారు. ప్రజాభిమానం కలిగిన నాయకుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు. రాజ్యాంగం మార్చటం ఎవరి తరం కాదన్నారు. దేశంలో దళితులకు న్యాయం జరుగుతూ ఉంటే ఇన్నేళ్లుగా వారు ఎందుకు పోరాటాలు చేస్తున్నారని, ఊరికి దూరంగా నివాసాలు ఉంటున్నారని, నేటికీ దేవాలయాల ప్రవేశాలు వారికి ఎందుకు లేవని ప్రశ్నించారు. ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకు కోసమే దళిత జపం చేస్తున్నాయని అన్నారు. దళిత బహుజనులు పాలక పార్టీల పట్ల జాగ్రత్తగా వ్యవహరించి వారి మోసాలను గ్రహించాలని కోరారు. మరో ముఖ్య అతిథి ప్రొఫెసర్ శ్రీపతి రాముడు మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను పంచుకోటమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. అంబేద్కరిజంపై సరైన అవగాహన లేని నాయకులే దళిత నేతలుగా ఉండటం బాధాకరమన్నారు. ఈ నాయకులే దళితులను ఇతర ప్రజలతో కలవకుండా దూరం చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు సామాజికంగా, ఆర్థికంగా బలపడిన తర్వాతే రాజకీయాల వైపు చూస్తే మంచిదన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ చదువులు బహుజనులకు దూరం చేసి మార్కెట్లో సరుకులా నేటి పాలకులు అమ్ముతున్నారన్నారు. నాణ్యమైన వైద్యం సంపన్న వర్గాల గుప్పెట్లో బందీ అయిపోయిందన్నారు. చట్టసభలలో సీట్లను ధనవంతులు కొనుగోలు చేస్తున్నారన్నారు. అందుకే చట్టసభలు బందెల దొడ్డుల్లా, అవినీతికి అడ్డాలా మారిపోయాయన్నారు. బహుజనుల రాజ్యాధికారం అంటే అసమానతలను రూపుమాపి సమానత్వం సాధించడమేనన్నారు. శ్రమ దోపిడీని నిర్మూలించి, దోపిడీ రహిత పరిపాలన తీసుకురావటమేనన్నారు. కుల ఆదిపత్యాన్ని, మత మౌఢ్యాన్ని దౌర్జన్యాన్ని నిలువరించి దుర్మార్గానికి తావు లేకుండా చేయడమేనని పేర్కొన్నారు. విజయ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ విజయ రాఘవరావు మాట్లాడుతూ కమ్మలు, రెడ్లు దళితుల ఓట్లు లేకుండా అధికారంలోకి రాలేదన్నారు. దేశంలో ఆధిపత్య కులాలు లేవని ఆధిపత్య కుటుంబాలు మాత్రమే ఉన్నాయన్నారు. అందరం కలిసి ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అన్నారు. సేల్ టాక్స్ రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ సదానంద రావు మాట్లాడుతూ దేశంలోని దళితులు, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలు, అగ్రవర్ణంలోని పేదలు ఐక్యమైన నాడే బహుజన రాజ్యాధికారం సాధించుకోవచ్చు అన్నారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు సావలి సుధాకర్ రావు మాట్లాడుతూ అంబేద్కరిజం సక్రమంగా అమలు చేసిన నాడే దేశంలో 90 శాతంగా ఉన్న ప్రజలు అభివృద్ధి చెందుతారని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ వి భక్తవత్సలం మాట్లాడుతూ ఇటువంటి సెమినార్లు నెలకు ఒకటి చొప్పున ప్రతి జిల్లాలో పెట్టి దేశంలోని బహుజనులను చైతన్యం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెజరీ ఆఫీసర్ డీపీ ఆర్ ప్రసాద్ రచించిన అంబేద్కరిస్టుగా నా జీవన యానం అనే పుస్తకాన్ని అతిధుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు పూర్ణకంటి తిరుమలయ్య స్వాగతం పలికారు. ప్రజా కళాకారుడు నూక తోటి శరత్, సంపత్ ఆలపించిన అభ్యుదయ గీతాలు సభికులను ఆలోచింపచేశాయి.

సీఎంతో ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్ గురువారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని సీఎం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీలో ఎన్‌సీసీ సేవలను మరింత విస్తరించడంతో పాటు ప్రత్యేకంగా ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎంకు తెలిపారు. ఎన్‌సీసీ డీజీ, ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారాన్ని అందిస్తామని జగన్ హామీనిచ్చారు. సీఎంను కలిసిన వారిలో క్రీడలు, యువజన సేవల శాఖ ముఖ్యకార్యదర్శి జి.వాణీమోహన్, ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఏపీ, తెలంగాణ) ఎయిర్ కమాండర్ పి.మహేశ్వర్, కల్నల్‌లు వీవీ శ్రీనివాస్, వివేక్ షీల్, స్టాఫ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రిషి రాజ్ సింగ్, లైసన్ ఆఫీసర్స్ వి.సత్యం, పి.శ్రీనివాసరావు ఉన్నారు.

19 నుంచి పది మూల్యాంకనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పదో తరగతి పరీక్షలు ముగింపు దశకు చేరుకోవడంతో మూల్యాంకనంపై పాఠశాల విద్యాశాఖ దృష్టి సారించింది. ఈనెల 19 నుంచి 26వరకు విద్యార్థుల సమాధాన పత్రాల మూల్యాంకనాన్ని చేపట్టి, ఫలితాలను వేగంగా వెల్లడించేందుకు కసరత్తు చేస్తోంది. ఇందుకోసం 23 జిల్లాల్లో మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేయగా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, నంద్యాల జిల్లా కేంద్రాలను మినహాయించింది. మూల్యాంకనం సమర్థంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల డీఈవోలకు తగిన మార్గదర్శకాలతో బుక్‌లెట్ల పంపిణీకి పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ చర్యలు చేపట్టారు. పరీక్షా ఫలితాల వెల్లడి అనంతరం అభ్యర్థులకు రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్‌కు అవకాశం కల్పిస్తారు. ఫోటోస్టాట్ కాపీలను అందిస్తారు. దీంతో మూల్యాంకనంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు జాగ్రత్తలకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈనెల 13న ప్రారంభమైన పది పరీక్షలు 18వ తేదీతో ముగియనున్నాయి. ఈ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు రెండేళ్లపాటు కరోనా కారణంగా 8, 9 తరగతులను పూర్తిగా చదవలేకపోయారు. ఈ విద్యార్థులు ప్రస్తుతం పది పరీక్షలు రాస్తున్నారు. విద్యార్థులు నిర్దేశిత ప్రశ్నల కంటే ఎక్కువ ప్రశ్నలకు (చాయిస్‌తో సహా) జవాబులు రాసి ఉంటే, వాటిల్లో ఎక్కువ మార్కులు వచ్చిన సమాధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలని విద్యాశాఖ నిర్ణయించింది. మూల్యాంకన కేంద్రాల్లో సిబ్బందికి అవసరమైన అన్ని ప్రాథమిక సౌకర్యాలను కల్పించి, మూల్యాంకనం వేగవంతానికి చర్యలలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

దళిత ద్రోహి జగన్

- నారా లోకేశ్ విమర్శ
- కర్నూలు జిల్లాలో ఘనస్వాగతం

విశాలాంధ్ర-ప్యాపిలి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దళితద్రోహి అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. లోకేశ్ యువ గళం పాదయాత్ర గురువారం కర్నూలు జిల్లాలోకి ప్రవేశించింది. టీడీపీ శ్రేణులు లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు. లోకేశ్ కోసం భారీగా తరలివచ్చారు. ఉత్సాహంగా లోకేశ్ అడుగులో అడుగు వేసుకుంటూ పాదయాత్రలో పాల్గొన్నారు. జక్కసానికుంట్లలో ఎస్సీ సామాజిక వర్గం ప్రతినిధులతో లోకేశ్ ముఖాముఖి మాట్లాడారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద స్వయం ఉపాధి కోసం తమ ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఇన్నోవాలు, జేసీబీలు అందించినట్లు గుర్తుచేశారు. ఆ పథకాన్ని సీఎం జగన్ రద్దు చేశారని ఆరోపించారు. దళిత మహిళ రమణమ్మ మాట్లాడుతూ తమకు శ్మశాన వాటిక కూడా లేదని, దీనికోసం ప్రభుత్వం ఇచ్చిన ఐదెకరాల భూమిని వైసీపీ ప్రభుత్వం వెనక్కి తీసుకుందని చెప్పారు. తమకు న్యాయం చేయాలని కోరారు. డోన్ నియోజకవర్గం ఎస్సీ సామాజికవర్గం ప్రతినిధులతో లోకేశ్ మాట్లాడుతూ 2001లో ఆర్డినెన్సు ద్వారా ఎస్సీ వర్గీకరణ చేసింది చంద్రబాబేనని, దీనివల్ల మాదిగ, ఉపకులాలకు 27 వేల ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఇప్పుడు మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా...ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే దళితులకు న్యాయం చేస్తామని, టీడీపీని ఆదరించండని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. జగన్ సర్కారు దళితులపై కేసులు పెట్టి వేధిస్తోందని విమర్శించారు. అక్రమ కేసులు బనాయించిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ పాలనలో ఏనాడు ఎస్సీలపై దాడులు జరగలేదన్నారు. ఎస్సీలకు సంబంధించిన సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తామని, ఏ ఒక్కటీ తొలగించబోమని హామీ ఇచ్చారు. ఎవరి హయాంలో న్యాయం జరిగిందో ఆలోచించుకోవాలని దళితులకు లోకేశ్ విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధర్మారం సుబ్బారెడ్డి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, గంధం శ్రీనివాసులు, దళిత నేతలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సాంస్కృతిక పునరుజ్జీవనం జరగాలి

ఇస్కఫ్ రాష్ట్ర సమితి సమావేశంలో ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరు: రాజకీయాలతో సంబంధం లేకుండా భావసారూప్యత, ప్రగతిశీల భావజాలం కలిగిన ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేసుకుంటూ సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. భారత సంస్కృతిక సహకార స్నేహ సంఘం(ఇస్కఫ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సమావేశం ఇక్కడి మల్లయ్యలింగం భవన్‌లో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వేములపల్లి శ్రీకృష్ణ వంటి ప్రముఖులు నాయకత్వం వహించిన ఇస్కఫ్‌ను మరింత బలోపేతం చేయాలని అన్నారు. సమాజ చైతన్యం కోసం సభ్యులు పాటుపడాలని సూచించారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను నేటితరానికి తెలియజేయాలన్నారు. సంపదతో పాటు ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రశ్నించే మేధావులు, రచయితలపై అక్రమ కేసులు బనాయిస్తూ దాడులు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య ఏడాదిపైగా సాగుతున్న యుద్ధంలో అమెరికా కాలు దువ్వుతూ ఉందన్నారు. ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు టీఎస్ సుకుమారన్, ప్రధాన కార్యదర్శి ఎస్.నరసింహులు మాట్లాడుతూ కటక్‌లో జరిగిన జాతీయ మహాసభల నిర్ణయాలను తెలిపారు. వివిధ దేశాల మధ్య స్నేహ సాంస్కృతిక సంబంధాలు, పర్యావరణ పరిరక్షణ దిశగా ముందుకు సాగుతూ ఉన్నామని చెప్పారు. ఇస్కఫ్ కార్యక్రమాలు విరివిగా చేపట్టాలని, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తొలుత శాంతి స్నేహ సంఘాల జాతీయ పూర్వ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.సుబ్బరాజు ద్వితీయ వర్ధంతి పురస్కరించుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.సత్యాంజనేయ, మల్లా మాధవరావు, బొల్లిముంత కృష్ణ, మోతుకూరి అరుణకుమార్, సుంకరి సూర్యనారాయణ, వసంతబాబు తదితరులు పాల్గొన్నారు.

17న రాష్ట్ర ప్రభుత్వ ఇఫ్తార్ విందు

డిప్యూటీ సీఎం అంజాద్ బాషా

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున ముస్లిం సోదరులకు ఈ నెల 17వ తేదీన ఇఫ్తార్ ఇవ్వనున్నామనీ, ఈ విందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నారని, ఇఫ్తార్ విందులో ముస్లింలు పాల్గొన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజాద్ బాషా పిలుపు నిచ్చారు. విజయవాడ విద్యాధరపురం స్టేడియంలో నిర్వహించనున్న ఇఫ్తార్ విందు ఏర్పాట్లుపై అంజాద్ బాషా, కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సంబంధిత అధికారులతో కలిసి గురువారం స్థానిక కలెక్టర్ విడిది కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ విందుకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 వేల మంది హాజరవుతారని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి విందు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, సమయానికంటే ముందుగానే ముస్లిం సోదరులు విందులో పాల్గొనేందుకు స్టేడియంకు చేరుకునే ముస్లిం సోదరులు స్టేడియంలో అసర్ నమాజ్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ముస్లిం సోదరులతో కలిసి సీఎం నమాజ్‌లో పాల్గొంటారన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలన్న చిత్తశుద్ధి లేదు: పవన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఇప్పటికిప్పుడు ప్రైవేటుపరం చేయాలనుకోవడం లేదని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే ప్రకటనను జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్వాగతించారు. గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు అనేది తెలుగువారి భావోద్వేగాలతో ముడిపడిన పరిశ్రమ. 32 మంది ప్రాణ త్యాగాలతో... ప్రాంతాలకు అతీతంగా సాగిన ఉద్యమాల ఫలితంగా సిద్ధించినదే విశాఖ ఉక్కు పరిశ్రమ. ఇంతటి ఘన నేపథ్యం ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఎప్పుడూ కేంద్రప్రభుత్వ యాజమాన్యంలోనే ఉండాలన్నది జనసేన పార్టీ ఆకాంక్ష అని తెలిపారు. ఈ పరిశ్రమ ప్రైవేటీకరణ అంశం ప్రకటన వచ్చినప్పుడు స్పందించి ఢిల్లీ వెళ్లి బీజేపీ అగ్రనాయకత్వాన్ని కలిసినప్పుడు వారు సానుకూలంగానే స్పందించారు. ఆ స్పందన ఎంతో ఆశావాహంగా కనిపించింది. కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షాను కలిసి విశాఖ ఉక్కుతో తెలుగు ప్రజలకున్న భావోద్వేగ బంధాన్ని తెలియచేసి ఈ పరిశ్రమను ప్రత్యేకంగా చూడాలని కోరామని తెలిపారు. 'విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం ఎందరో రైతులు తమ భూములను త్యాగం చేశారు. ఇలాంటి పరిశ్రమపై రాష్ట్రపాలకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వారికి తొలి నుంచీ చిత్తశుద్ధి లోపించింది. జనసేన స్టీల్ ప్లాంట్ కార్మికులకు మద్దతుగా నిలవడంతో పాటు భారీ బహిరంగ సభ నిర్వహించి రాష్ట్ర పాలకులు అఖిలపక్షాన్ని తీసుకొని కేంద్ర ప్రభుత్వం దగ్గరకు వెళ్లాలని విజ్ఞప్తి చేసింది. అయినా వైసీపీ పాలకులు స్పందించలేదు. కొద్ది రోజుల కిందట పొరుగు రాష్ట్రం ఈ అంశంపై స్పందించింది. దీని వెనక ఉన్న రాజకీయ ప్రయోజనాలు, నేపథ్యాలపై వైసీపీ పాలకులు విమర్శలు చేస్తున్నారు తప్ప పరిశ్రమ కాపాడుతామనే మాట చెప్పలేకపోయారని' ఆ ప్రకటనలో పవన్ పేర్కొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్‌లకు నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రస్థాయిలో జర్నలిస్టులకు 2023-2024 సంవత్సరానికిగాను అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసేందుకు శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు www.ipr.ap.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం నూతనంగా అక్రిడిటేషన్ కార్డుల మంజూరు కోసం జీవో నంబర్ 38 తీసుకురావడంతో పాటు జీవో నంబర్ 40 ద్వారా స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల నియామకం పూర్తి చేసిన నేపథ్యంలో మొదటగా రాష్ట్రస్థాయిలో అక్రిడిటేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. జర్నలిస్టులు తమ వివరాలతో పాటు యాజమాన్యాల సిఫారసు లేఖ, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, అవసరమైన డాక్యుమెంట్లు పీడీఎఫ్ ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కమిషనర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

జాన్సన్ బాబు, శివారెడ్డి డిమాండ్

విశాలాంధ్ర - అనంతపురం అర్బన్: కార్పొరేట్ విద్యా సంస్థల్లో అక్రమంగా చేపట్టిన ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని, విశ్వ విద్యాలయంలో కామన్ ఎంట్రెన్స్ పరీక్ష రద్దు చేసి పాత పద్ధతిలోనే కొనసాగించాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి డిమాండ్ చేశారు. ఇక్కడి నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుల్లాయ్ స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ముందస్తుగా అడ్మిషన్లు చేపట్టారన్నారు. ఏప్రిల్‌లో అయితే ఒక ఫీజు, మే మాసంలో ఒక ఫీజు అంటూ ముందస్తుగా కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్లు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ ఏడాది ఏకంగా నారాయణ విద్యా సంస్థలు విద్యార్థుల ఫీజును నెలవారీ కంతుల రూపంలో ప్రకటించడం వడ్డీ వ్యాపారాన్ని తలపిస్తోందన్నారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని బోధించే చదువును వ్యాపారంలా మారుస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కార్పొరేట్ విద్యాసంస్థలను హెచ్చరించారు. విద్యా మాఫియాకు పాల్పడుతున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ విద్యాసంస్థలను తనిఖీ చేయడానికి సైతం భయపడే పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు నిర్వీర్యానికి కుట్ర

విభజన హామీలపై జగన్ నోరు విప్పాలి: చలసాని శ్రీనివాస్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రత్యేక హోదా సాధనకు అఖిలపక్షం ఏర్పాటు చేయాలని, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఇప్పటికైనా అధికార వైసీపీ తక్షణమే అన్ని పార్టీలు, పోరాట సమితి నాయకులతో అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని విభజన హామీల సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. గురువారం విశాఖ ప్రెస్ క్లబ్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగుజాతి కోసం ప్రాణాలర్పించి చిత్తశుద్ధితో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అదే విధంగా ఎంతో మంది ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తెలంగాణ ప్రభుత్వ కాకుండా, వైసీపీ ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని బిడ్ వేయాలని సూచించారు. విభజన సమస్యలపై ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని, విశాఖలోని విలువైన సంపదలను ఆదాని తదితర కంపెనీలకు దారాదత్తం చేయడంసరికాదున్నారు. విశాఖ ఉక్కును నిర్వీర్యం చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించిన పరిశ్రమ ఇది అని, రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. విజయ సాయి రెడ్డి ఏమైయ్యారని, స్టీల్ ప్లాంట్ కోసం ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మెడలు వంచుతామన్న జగన్ ఎందుకు కేంద్రాన్ని ప్రశ్నించడం లేదని అడిగారు. రాష్ట్రం ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం నిర్వహించాలన్నారు. 35 మంది ఎంపీలు ఉన్నా పార్లమెంట్‌లో ప్రస్తావించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీకి కిరణ్ కుమార్ రెడ్డి మద్దతుగా మాట్లాడడం అంటే ఏపీకి అన్యాయం చేసినట్టే అని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ రైల్వే జోన్‌లో అన్యాయం జరుగుతున్నా ఎవరూ గొంతు ఎత్తడం లేదన్నారు. ఈ మీడియా సమావేశంలో ఆంధ్ర ఫోరం అధ్యక్షులు ప్రొఫెసర్ జి. అప్పలనాయుడు, మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జార్జ్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమానికి

ఏఐటీయూసీ మద్దతు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతిచ్చింది. ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం దశలవారీగా చేపట్టిన ఉద్యమానికి ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతివ్వాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రెటరీ జనరల్ పలిశెట్టి దామోదర్ నాయకత్వంలోని జేపీసీ ప్రతినిధి బృందం గురువారం గొల్లపూడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చి నేతలకు విజ్ఞప్తి చేసింది. ఉద్యోగుల ఉద్యమానికి తమ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని, అవసరమైతే ప్రత్యక్షంగాను పాల్గొంటామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, రాష్ట్ర కార్యదర్శి బీవీవీ కొండలరావు తదితరులు హాజరయ్యారు. ఓబులేసు మద్దతును ప్రకటిస్తూ ఫిబ్రవరిలో జరిగిన ఆందోళనలోను, ర్యాలీలలోను ఏఐటీయూసీ ప్రత్యక్షంగా పాల్గొందని గుర్తుచేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వ్యతిరేక నిర్ణయాల్ని ప్రభుత్వం తీసుకుంటోందన్నారు. వాటిని ఐక్య ఉద్యమాల ద్వారా ప్రతి సంఘటించాలని, న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు చెల్లించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలలో ఏఐటీయూసీ శ్రేణులను ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణలో భాగస్వాములను చేస్తామని హామీ ఇచ్చారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాల్లో ఏఐటీయూసీ అగ్రభాగాన ఉంటుందని, ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఈ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇవ్వడంపై ధన్యవాదాలు తెలిపారు.

పోలవరంపై పాలకుల నిర్లక్ష్యం

డేగా ప్రభాకర్ విమర్శ

విశాలాంధ్ర-పోలవరం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో పాలకులు ఉదాసీనత ప్రదర్శించడం శోచనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ వ్యాఖ్యానించారు. పోలవరం ఎస్‌కేఎస్‌ఎం లాడ్జిలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డేగా ప్రభాకర్ మాట్లాడారు. ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని, దీనికి ముందు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోలవరం నుండి అమరావతి వరకు పాదయాత్ర చేస్తామని హెచ్చరించారు. పోలవరం ఎత్తు తగ్గించవద్దని, ప్రాజెక్టు కోసం గతంలోనూ పోలవరం నుండి ఏలూరు కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశామని గుర్తు చేశారు. పోలవరం నిర్మాణంపై హామీలు తప్ప ఏ ముఖ్యమంత్రి శుద్ధితో అమలు చేయడం లేదని ప్రభాకర్ ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణం నత్తనడకన నడుస్తున్నదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రాయలసీమకు పుష్కలంగా నీరు అందించవచ్చని చెప్పారు. లక్షలాది ఎకరాలకు సాగు, తాగునీరు అందించే బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరమని కొనియాడారు. నిర్వాసితుల కష్టాలు, సమస్యలు తెలుసుకోవడం, ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి కోసం ప్రజల పక్షాన చేస్తున్న పాదయాత్రను జయప్రదం చేయాలని డేగా ప్రభాకర్ కోరారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన సీపీఐ పోలవరం పట్టణ కార్యదర్శి జల్లేపల్లి వేణుగోపాల్‌కృష్ణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్టీ మండల కార్యదర్శి జల్లేపల్లి వెంకట నరసింహారావు(జేవీ), తిరుమలశెట్టి రవికుమార్, కొరమాటి సతీశ్, ఎం.ప్రసాద్, రాజబాబు పాల్గొన్నారు.

సంపాదకీయం

జనవాణిగా ప్రతిపక్ష ఐక్యత

ప్రత్యర్థి పక్షంతో ఢీకొనే రాజకీయ పక్షాలు ఎదుటి పక్షం బలం చూసి జడుసుకోకుండా తమ బలం మీద విశ్వాసం కలిగి ఉంటేనే ఫలితం ఉంటుంది. దానికి బదులు ప్రతిపక్షంలో ఉన్న అంతర్వైరుధ్యాల గురించి అనునిత్యం ఆలోచిస్తూ కూర్చుంటే విజయానికి దూరంగా ఉండిపోవలసిందే. ప్రస్తుత రాజకీయ పరిస్థితినిబట్టి మోదీ నాయకత్వంలోని బీజేపీని ఓడించడానికి ప్రతిపక్షాలు ఒకే లక్ష్యంతో ఉమ్మడిగా కృషి చేయడమే కాకుండా సైద్ధాంతిక పటుత్వమూ కనబరచాలి. ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్ లాంటి కేంద్ర సంస్థల దాడులవల్లే ప్రతిపక్షాలు ఐక్యమవుతున్నాయన్న మోదీ వ్యాఖ్య కేవలం ఆయన వాక్చాతుర్యానికే ప్రతీక కాదు. అది ఆయన వెన్నులో వణుకుకు కూడా నిదర్శనం. మోదీ కాలక్రమంలో బీజేపీని ఎన్నికలలో విజయం సాధించే యంత్రాంగంగా మార్చేశారన్నది ఎంత వాస్తవం అయినా రెండు దఫాల పదవీకాలంలో తీసుకున్న అనేక ప్రజా వ్యతిరేక చర్యలు, పెంచి పోషించిన విద్వేష రాజకీయాలు ప్రజలను జాగరూకం చేస్తూనే ఉన్నాయి. మోదీ వికృత పాలన నుంచి విముక్తం కావాలన్న ఆకాంక్ష ప్రతిపక్షాలకే కాక ప్రజల్లో కూడా ఉంది. అయితే ఈ భావన ఆచరణలోకి రావాలంటే ప్రతిపక్షాలు చారిత్రక బాధ్యత నిర్వర్తించాలి. ప్రతిపక్షాల ఐక్యత కోసం సుదీర్ఘ కాలంగా అనేక రకాల ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. చిక్కెక్కడ ఉంది అంటే ప్రతిపక్షాలలోనూ కనీసం రెండు శిబిరాలు ఉన్నాయి. ప్రతిపక్ష కూటమిలో కాంగ్రెస్ ఉండాలని ఒక వర్గం భావిస్తూ ఉంటే కాంగ్రెస్‌ను మినహాయించాలని మరికొన్ని పార్టీలు అనుకుంటున్నాయి. వివిధ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న భిన్న ప్రతిపక్ష పార్టీలకు మోదీని గద్దె దించాలన్న సంకల్పం ఎంత బలంగా ఉన్నప్పటికీ తమ రాష్ట్రాలలో కాంగ్రెసే ప్రధాన ప్రత్యర్థి అయినందువల్ల ప్రతిపక్ష ఐక్యతకు విఘాతం కలుగుతోంది. బుధవారం బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీని, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గేను కలుసుకోవడం ప్రతిపక్ష ఐక్యత ఒక అడుగు ముందుకు పడ్తుందన్న ఆశ చిగురించింది. ప్రస్తుతం ప్రతిపక్షాలను ఐక్యం చేయడానికి, అందులో కాంగ్రెస్ ప్రధాన భాగస్వామిగా ఉండడం అనివార్యం అని భావిస్తున్న నితీశ్ కుమార్ చిత్త శుద్ధితో ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. నితీశ్ అనేక సందర్భాలలో పిల్లి మొగ్గలు వేసిన మాట నిజమే. బీజేపీ నాయకత్వంలోని ఎన్.డి.ఏ. కూటమిలో భాగస్వామి అయి అధికారంలో కొనసాగడమూ వాస్తవమే. కానీ నితీశ్ కుమార్ మౌలికంగా సోషలిస్టు భావాలున్న వారు. సోషలిస్టులు బీజేపీతో కలిసి నడిచిన సందర్భాలు దశాబ్దాలుగా అనేకం ఉన్నాయి. నితీశ్ కుమార్ చంచల రాజకీయాలు అలా ఉంచితే ఆయన రాజకీయ చాతుర్యం అందరికీ తెలిసిందే. ప్రతిపక్ష ఐక్యత కోసం జరుగుతున్న ప్రయత్నాలలో ఆయన ప్రతిపక్ష కూటమిలో కాంగ్రెస్ ఉండి తీరవలసిందేనని పట్టుబడుతూనే ఉన్నారు. గత ఆగస్టులో బీజేపీతో తెగతెంపులు చేసుకుని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్.జె.డి.)తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుంచీ నితీశ్ ప్రతిపక్ష ఐక్యత కోసం చేస్తున్న కృషిలో రుజువర్తన స్పష్టంగా కనిపిస్తూనే ఉంది.

గత డిసెంబర్‌లో నితీశ్ నాయకత్వంలోని జె.డి.(యు) జాతీయ సమితి ప్రతిపక్ష ఐక్యతకోసం కృషిచేసే బాధ్యతను నితీశ్‌కు అప్పగించింది. ప్రతిపక్షాల మధ్య ఉన్న విభేదాల గురించే మాట్లాడకుండా సామ్యం మీద దృష్టి కేంద్రీకరించాలని నితీశ్ అంటున్నారు. ఇది సాధ్యం అయితే ప్రజల్లో కూడా ప్రతిపక్షాల మీద విశ్వాసం పెరుగుతుంది. ప్రతిపక్ష ఐక్యతా బాధ్యతను నితీశ్ స్వీకరించాలని బుధవారం నాటి సమావేశంలో రాహుల్ గాంధీ అన్నారు. అంటే ప్రతిపక్షాలతో కలిసి నడవడానికి కాంగ్రెస్ సుముఖంగానే ఉన్నట్టు లెక్క. కాంగ్రెస్ కు అనుకూలంగా ఉన్న పార్టీలతో చర్చించే బాధ్యతను ఖడ్గేకు, కాంగ్రెస్ అంటే కిట్టని ప్రాంతీయ పార్టీల నాయకులైన మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, కె.చంద్రశేఖర రావును సంప్రదించే బాధ్యతను నితీశ్‌కు అప్పగించారు. ఇటీవల అదానీని వెనకేసుకొచ్చిన శరద్ పవార్ తో మాట్లాడే బాధ్యతా నితీశ్ కుమార్ కే అప్పగించారు. దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ కలిసి బీజేపీని ఓడించి తీరాలన్న దీక్ష కనబరిచి ఉమ్మడిగా పోటీ చేస్తే బీజేపీకి మంచి సవాలు విసరొచ్చు. అలాగే బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు, కాంగ్రెస్ మధ్య ఏదో ఒక రకమైన అవగాహన కుదిరితే బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కకుండా చూడొచ్చు. ఈ ప్రయత్నం ఇటీవల సఫలం కాకపోయినా మిగిలిన మార్గం అదే. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్ వాది పార్టీకి, కాంగ్రెస్‌కు శ్రుతి కుదిరితే 20 శాతం ఉన్న మైనారిటీల ఓట్లు చీలకుండా చూడొచ్చు. బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌లో అవగాహన కుదిరితే మొత్తం 134 స్థానాలలో ప్రతిపక్షం 70 స్థానాలు సాధించవచ్చు. ఈ అవగాహన లేకనే 2019లో ఈ 134 సీట్లలో 115 చోట్ల బీజేపీ విజయం సాధించింది. ప్రతిపక్ష కూటమికి నాయకుడెవరు, ప్రధానమంత్రి పదవికి అభ్యర్థి ఎవరు అన్న చర్చలు ప్రస్తుతానికి అనవసరం. 1996, 2004, 2009 లో ప్రతిపక్షాల నాయకుడు ఎవరు అన్న దానితో నిమిత్తం లేకుండానే ఇప్పుడు ప్రతిపక్షంలోఉన్న పార్టీలు ఎన్నికల బరిలోకి దిగాయి. ప్రజలెదుర్కొంటున్న సమస్యలనుంచి దృష్టి మళ్లించడానికి మోదీ అనుసరించని ఎత్తుగడలే లేవు. ప్రజా సమస్యలను చర్చనీయాంశం చేస్తే ప్రతిపక్షాల మీద నమ్మకం కుదురుతుంది. అలాగే తమకు అంతగా బలంలేని రాష్ట్రాలలో కాంగ్రెస్ అత్యాశ విడనాడాలి. గత రెండు మూడేళ్ల కాలంలో ప్రతిపక్ష పార్టీలలో ఐక్యతా కాంక్ష ఎంత బలంగా వ్యక్తం అయిందో విభేదాలు కూడా అంతే ప్రస్ఫుటంగా కనిపించాయి. అయితే రాహుల్, ఖడ్గే తో నితీశ్ జరిపిన చర్చలు ఇంతకు ముందు జరిగిన ప్రయత్నాలతో పోలిస్తే ఒకడుగు ముందుకు వేసినట్టే. అన్నింటికీ మించి బీజేపీ మీద రాజీ లేని సైద్ధాంతిక పోరాటం సాగించగలగాలి.

ప్రాంతీయ పార్టీలకు సైద్ధాంతిక నిబద్ధత తక్కువ. కానీ లక్ష్యం మీద గురిపెట్టగలిగితే సైద్ధాంతిక ప్రాతిపదికా ఏర్పడవచ్చు. నితీశ్ ఈ మధ్య దాదాపు అందరు ప్రతిపక్ష నాయకులనూ కలుసుకున్నారు. ప్రతిపక్ష కూటమికి సారథి ఎవరు, మోదీ వ్యతిరేక పోరాటంలో ప్రతిపక్ష నేతల పాత్ర ఏమిటి అన్న రెండు ప్రధానాంశాలు నితీశ్ చర్చల్లో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. ప్రజాస్వామ్య, సెక్యులర్ విధానాల పరిరక్షణ అంశాలు ప్రతిపక్ష కూటమికి తగిన సైద్ధాంతిక పునాది ఏర్పాటు చేయగలవు. ప్రతిపక్ష పార్టీలు మూడు రోజులు సమావేశమై సకల విషయాలు చర్చించి నిర్దిష్ట అభిప్రాయానికి రావాలని, ఎజెండా సిద్ధం చేసుకోవాలని రాహుల్ చేసిన సూచన కాంగ్రెస్‌లో కనిపిస్తున్న మార్పుకు చిహ్నం. టూకీగా చెప్పాలంటే ప్రతిపక్ష ఐక్యత జనవాణిగా ఉండాలి.

మోదీ నియంతృత్వ పాలనకు అంతం పలుకుదాం

ముప్పాళ్ళ నాగేశ్వరరావు

మోదీ ప్రభుత్వ ఆడంబర పాలన భారతదేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. గడిచిన 9 సంవత్సరాల పాలనలో తీసుకున్న నిర్ణయాలన్నీ గ్రామీణ రైతులకు, దేశ ప్రజలకు, చిన్నచిన్న పారిశ్రామికవేత్తలకు, చిరు వ్యాపారులకు, అన్ని వర్గాల ప్రజలకు నష్టం కలిగిస్తూ బడా కార్పొరేట్లకు వేల కోట్లు దోచుకొనుటకు అనుకూలంగా ఉన్నాయి. ఫలితంగా కుబేరుల సంఖ్య పెరిగి మధ్యతరగతి నుండి దిగువ వర్గాల నిజ ఆదాయాలు తగ్గిపోయాయి. సాంస్కృతిక, మెజారిటీ జాతీయవాదం పేరుతో సాగిస్తున్న పాలన దేశంలో మత ఉద్రిక్తతలకు దారితీస్తున్నది. పాలనలో పారదర్శకత నిజాయితీ ఉంటుందని మోదీ చెప్పిన మాటలు అదృశ్యమైపోయాయి. కనీస పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతులను పాటించకుండా బీజేపీకి బలం లేని రాష్ట్రాలలో సైతం ప్రతిపక్ష ప్రభుత్వాలను పడగొట్టి లేక ఎమ్మెల్యేలను చీల్చి తన ప్రభుత్వాలను ఏర్పరచుకొనే దిగజారుడు తనానికి మోదీ పాల్పడ్డాడు.

ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నానని ప్రగల్భాలు పలికిన మోదీ, బీజేపీ ఈ కాలంలో అవినీతిని కార్పొరేటీకరణ చేసింది. మోదీ నామధేయులు లక్షల కోట్లు బ్యాంకుల నుంచి కాజేసి మోదీ అండతో విదేశాలకి పారిపోయారు. తమకి నచ్చని, ప్రశ్నించిన ప్రతిపక్ష నేతలపైకి సీబీఐ, ఈడీ సంస్థలను ఉసిగొల్పి వేధించడం, జైల్లో పెట్టించడం పరిపాటిగా మారింది. ప్రతిపక్షాలకు చెందిన వివిధ రాష్ట్రాలలో వ్యాపారాలు, పరిశ్రమలు నిర్వహించే నేతలపై ఈడీని ప్రయోగించి, భయపెట్టి లొంగదీసుకుని నిస్సిగ్గుగా బీజేపీలోకి చేర్చుకుంటున్నారు. అదాని కంపెనీల ఆర్థిక నేరాలపై హిండెన్ బర్గ్ నివేదికపై సంయుక్త పార్లమెంటరీ కమిటీని వేసి చర్చించడానికి మోదీ ప్రభుత్వం భయపడింది. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి విద్యావంతులైన నిరుద్యోగులను నిట్ట నిలువునా బీజేపీ ప్రభుత్వం మోసంచేసింది. 45 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగింది.

నల్లధనం వెలికితీత పేరుతో పెద్ద నోట్లు రద్దు అని చెప్పి మోదీ చేసిన హంగామా అంతా ఇంతా కాదు. మూడు మాసాలలో ఆర్థిక వ్యవస్థలో అనూహ్యమైన మార్పులు వస్తాయని ఓర్పు పట్టండని నమ్మబలికి 74 మంది ప్రజల ప్రాణాలను బలి తీసుకున్నాడు. 1000 రూపాయల నోట్లు రద్దు చేసి 2000 నోట్లను ముద్రించి నల్ల డబ్బు దాచుకోవడానికి సులభతరం చేశాడు. 2014 ఎన్నికల ప్రచార సభలలో విదేశాలలో ఉన్న నల్లధనాన్ని వెనక్కు తెప్పించి కుటుంబానికి 15 లక్షల చొప్పున వారి బ్యాంకు ఖాతాలో వేస్తామని చెప్పిన మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క పైసాకూడా తేలేదు. బ్యాంకుఖాతాలో వెయ్యలేదు. బ్యాంకులకు రుణాలను ఎగవేసిన వారి జాబితాలు కూడా బైటపెట్టలేదు. 2014లో డీజిల్, పెట్రోలు ధరలను తగ్గిస్తానని చెప్పి అడ్డగోలుగా పెంచి వినియోగదారులను నిలువు దోపిడి చేస్తున్నాడు. 2014లో 404 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు 1120 రూపాయలకు పెంచి మహిళల సహనానికి పరీక్ష పెట్టిన కిలాడి నరేంద్ర మోదీ. రైతాంగ ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న మోదీ మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చి భూమిని రైతుకి దూరంచేసే స్థితికి ఒడిగట్టాడు. దిల్లీ చారిత్రక రైతు పోరాటంతో ఎత్తుగడగా క్షమాపణ చెప్పి మూడు చట్టాలను ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించినా రైతుకు మేలు చేసింది ఏమీ లేదు. రైతు స్థితి నానాటికి దిగజారిపోతోంది.



రాష్ట్రానికి ప్రత్యేక హోదా 10 సంవత్సరాలు కావాలని విభజన సందర్భంగా డిమాండ్ చేసిన బీజేపీ వచ్చేది మేమే ! ఇచ్చేది మేమే అని ఆడంబరాలు పలికి నేడు అది ముగిసిన అధ్యాయమని చెప్పి నవ్యాంధ్రను దారుణంగా మోసగించింది. దిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామన్న మోదీ అమరావతి మూడు ముక్కలు చేస్తానంటున్న జగన్మోహన్ రెడ్డికి వత్తాసుగా నిలబడడం హేయమైన చర్య! జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం నిర్మాణానికి కేంద్రం సహకరించక అడ్డంకులు సృష్టించడం, నిధులివ్వకపోవడం క్షమార్హం కాదు. రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అన్న మాటను నీట ముంచేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు బీజేపీ చేసిన ద్రోహం ఎన్నటికీ క్షమించరానిది.

25 పార్లమెంటు సీట్లిస్తే కేంద్ర ప్రభుత్వ కాలరు పట్టుకొని హోదా తెస్తానన్న సీఎం జగన్మోహన్ రెడ్డి మోదీ, అమిత్ షాలకు పాదాభివందనాలు చేస్తూ తన బెయిల్ రద్దు కాకుండా వేడుకుంటున్నాడు. తన బాబాయి హత్యకు కుట్రదారులేవరో, హంతకులెవరో ప్రజలలో నిర్ధారణ జరిగిపోయింది. కనీసం వచ్చే ఎన్నికల దాకా విచారణ జాప్యం చేయడం కోసం ముఖ్యమంత్రి పదవిని అడ్డం పెట్టుకొని నానా తంటాలు పడుతూ ఓట్లు ఇచ్చి గెలిపించిన ప్రజలకు పంగనామాలు పెడుతున్నాడు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడవలసిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం నోరెత్తకుండా మోదీ ప్రభుత్వానికి "జీ హుజూర్" అంటూ సాగిలపడుతోంది.

రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి నిత్యం ఓట్ల కొనుగోళ్ల స్కీములతో ముఖ్యమంత్రి తన్మయత్వం చెందుతున్నాడు. ఉన్నాడు. చెత్త పన్ను, విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ ఛార్జీల పెంపు, ఆర్టీసి చార్జీల పెంపు, ఇళ్ల పన్నుల పెంపు, ఇసుక దందా, మద్యం దందాలతో వైసీపీ ప్రభుత్వం మునిగి తేలుతోంది. అధిక భారాలను, పోలీసుల నిర్బంధాలను ఎదుర్కొంటున్న ప్రజల పైన, ప్రశ్నిస్తున్న సంఘాలపైన పోలీసుల దమన కాండలతో మోదీకి నేనేమీ తగ్గను అన్నట్టు ముఖ్యమంత్రి నియంతృత్వ పోకడలకు పోతున్నాడు. అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో అలుముకున్న కారు చీకట్ల నుండి బయటపడడానికి చైతన్యవంతమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన బాధ్యత మనపైఉంది. ఈ నేపథ్యంలో సీపీఐ దేశవ్యాప్తంగా స్థానిక స్థాయిలలో పాదయాత్రలను ఈనెల 14 నుంచి మే 15 వరకు స్థానిక స్థాయిలో పాదయాత్రలకు పిలుపు ఇచ్చింది. మన రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం ఉభయులు కలిసి ఈనెల 14 నుండి 30 వరకు ఉమ్మడిగా పాదయాత్రలు, ప్రచార సభలు నిర్వహిస్తున్నాయి. మే డే అనంతరం మే 15 వరకు ఈ పాదయాత్రలను సీపీఐ ఆయా జిల్లాలలో కొనసాగించ నున్నది. ఈ యాత్రలో ప్రచార సభలలో పార్టీ, ప్రజా సంఘాల కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొనాలని దేశభక్త లౌకిక ప్రజాస్వామ్య వ్యక్తులు శక్తులందరినీ కూడగట్టి గ్రామీణ స్థాయికి తీసుకువెళ్లాలని సీపీఐ రాష్ట్ర సమితి విజ్ఞప్తి చేస్తున్నది.

వ్యాస రచయిత సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి

సామాజిక విముక్తికి అంబేద్కర్ బాట

నేడు దళిత బహుజనులు ఓట్ల రాజకీయాలకు పావులుగా మారి సమిధలవుతున్నారు. పార్లమెంటరీ రాజకీయాల భ్రమల్లో నుంచి ఈ వర్గం బైటపడి అంబేద్కర్ సూచించిన ప్రత్యామ్నాయ రాజకీయాలు, సంస్కృతి, సాంఘిక విముక్తి, ఆర్థిక సమానత్వం, అణగారిన వర్గాలకు రాజకీయ అధికారం సాధించుకోటానికి మనం నేడు ఆయనబాటలో నడవాల్సిన అవసరం ఉంది. అంబేద్కర్ గొప్ప మానవతావాది, ఆర్థికవేత్త, తత్వవేత్త, ఆర్థిక సంబంధాల ప్రాముఖ్యతను గుర్తించిన మేథావి. ఆయన బడుగు, బలహీనవర్గాల ప్రజల ఉన్నతికి రాజ్యాంగ రక్షణ కల్పించటం కోసం ఆయన ఎంతో తపన పడ్డాడు. ప్రజలకు అన్నం పెట్టే కీలక రంగమైన వ్యవసాయం పూర్తిగా ప్రభుత్వానికి చెందిన పరిశ్రమగా ప్రకటించాలని సూచించాడు. ప్రభుత్వం స్వయంగా నిర్వహించే పరిశ్రమలను భారత రాజ్యాంగంలో పొందుపరచాలని సూచించాడు. కీలక మౌలిక పరిశ్రమలు, వ్యవసాయక భూమి వాటిపై హక్కులను పరిహారమిచ్చి స్వాధీనపరచుకోవాలని సూచించాడు. భూమిని ఒక స్థిర ప్రమాణంలో విభజించి వ్యవసాయక పరిశ్రమలను వ్యవస్థీకరించాలని అన్నాడు. ఆ వ్యవసాయక క్షేత్రాలను సమిష్టి సహకార క్షేత్రాలుగా చేసి కుల, మత బేధాలు లేకుండా ఏర్పడిన గ్రామ సమూహాలు సాగుచేయాలి. ఉత్పత్తిని సమిష్టిగా పంచుకోవాలి. భూస్వాములు, కౌలుదారులు, భూమిలేని కూలీలు ఉండరాదు. మొత్తంగా ఈ సమిష్టి వ్యవసాయ క్షేత్రాలకు ధనం, మౌలిక వనరులను ప్రభుత్వమే సమకూర్చాలి. తద్వారా ఉత్పాదకతను పెంచాలి. ప్రజల ఆర్థిక జీవితాన్ని ప్రణాళిక బద్ధంగా ఉన్నతంగా తీర్చిదిద్దాలని అంబేద్కర్ వివరించాడు. ప్రతిపౌరునికి బీమా తప్పనిసరి చేయాలని బీమా వ్యాపారాన్ని జాతీయం చేయాలన్నాడు. పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం సోషలిజం తప్పనసరి అని సూచించాడు. లేకుంటే ఆర్థిక అసమానతలు నెలకొంటాయన్నాడు. అంబేద్కర్ సూచనలు సహజంగానే ఆనాటి జాతీయోద్యమానికి నాయకత్వం వహించిన బడా భూస్వామ్య వర్గాలకు రుచించలేదు. అంబేద్కర్ ఆలోచనలను తోసి పక్కన పెట్టారు. అంబేద్కర్ ఒక ఊహాజనిత సోషలిస్టుగానే మిగిలిపోయాడు. తదుపరి ఎప్పటికో రాజ్యాంగం అమలులోకి వచ్చిన 26సంవత్సరాల తరువాత 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 'సోషలిస్టు' అనే ప్రజల రాజ్యాంగప్రవేశికలో చేర్చి చేతులు దులుపుకున్నారు. రాజ్యాంగం ప్రజల జీవితాలకి గ్యారంటీ ఇవ్వలేదని గ్రహించిన అంబేద్కర్ రాజ్యాంగ సభలో ఇలా మాట్లాడారు. "1956 జనవరి 26న మనం వైరుధ్యాలతో కూడిన జీవితం ప్రారంభిస్తాం. మనకు రాజకీయాలలో సమానత్వం, సామాజిక, ఆర్థిక జీవితంలో అసమానత్వం ఉంటాయి. రాజకీయాలలో మనిషికి ఒక ఓటు. ఓటుకు ఒకే విలువ ఉంటుంది. కాని సామాజిక, ఆర్థిక జీవితంలో మనుషులందరికీ ఒకే విలువ ఉండదు. ఎంతకాలమీ వైరుధ్యాల జీవితం? ఈ వైరుధ్యాల్ని వీలైనంత త్వరగా అంతం చేయాలి. లేకుంటే ఈ సభవారు కష్టపడి నిర్మించిన ఈ వ్యవస్థలను అసమానతలకు గురైన ప్రజలు ఎగర కొట్టేస్తారు." అంటాడు.

దారిద్ర్య నిర్మూలనకు మౌలికమైన వ్యవసాయ సంస్కరణలు అమలు కాలేదు. గ్రామీణ పేదరికాన్ని తొలగించి గ్రామసేవల్లో అణచివేతలకు, వివక్షకు గురౌతున్న నిమ్నజాతుల ప్రజలకు దక్కాల్సిన భూమి వారికి దక్కలేదు. భూ సంస్కరణలు అమలు కాలేదు. 75సంవత్సరాల స్వాతంత్ర్య ఫలాలు ఎవరికి దక్కాయి? ఎంతో గర్వంగా చెప్పుకుంటున్న ప్రాజెక్టులు, అభివృద్ధి ప్రణాళికలు ఎవరికి ప్రయోజనం కలిగించాయి? గ్రామ, పట్టణ ప్రాంతాల్లో లభించే మేలైన భూమిని ఎవరు ఆక్రమించారు? చట్టసభ, కార్యనిర్వాహక, న్యాయ విభాగాలు, మరికొన్ని కీలక విభాగాల్లో ఎవరు స్థిరపడిపోయారు? కాబట్టి 75 ఏళ్ల నాడు వచ్చిన స్వాతంత్ర్యం నిమ్న జాతులది కాదని తేలిపోయింది. అంబేద్కర్ ఊహలు కలలుగానే తేలిపోయాయి. అలాగే రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపరచిన అంబేద్కర్ ఒక సందర్భంలో "నేనే ఏర్పరచిన రిజర్వేషన్లలో ఆర్థిక, సామాజిక సమానత్వం వస్తుందనుకున్నా, అయితే వాటి వల్ల గుప్పెడు మంది గుమస్తాలు భూమి లేకుండా భూస్వాములకు దాస్యం చేస్తున్నారు. వారికోసం నేను ఏమీ చేయలేకపోయాను." అంటూ ఆవేదన చెందారు. అంటే భూ పంపిణీ జరగకుండా ఈ దేశంలో ఆర్థిక, సామాజిక సమానత్వం జరగదు. వ్యవసాయాధారిత మన దేశంలో భూమికి, సామాజిక న్యాయానికి ఉన్న సంబంధం ఇదే. భూ పంపిణీ జరగకుండా సామాజిక న్యాయం సాధ్యంకాదు కాబోదు. సామాజిక న్యాయానికి, భూమికి ఎంతో అవినావభావ సంబంధం ఉంది. ఎందుకంటే మానవజాతికి సమస్త జీవనాధారమైనది భూమి. కాబట్టి అనాదిగా భూమిని ఆక్రమించుకోవటం, దోచుకోవటం జరుగుతూ వస్తోంది.

ఈ భూమి మీద బ్రతుకుతున్న మనుషుల్ని, సమస్త జీవజాలాన్ని, మొత్తం సంపదను ఆక్రమించుకొని రాజ్యాలు ఏర్పడ్డాయి. రాజులు ఏర్పడ్డారు. యుద్ధాలు జరిగాయి. ఇలా చరిత్రంతా మానవాళి నెత్తుటితో తడిసి ముద్దయింది. చివరికి మట్టిబిడ్డలైన నిమ్నజాతి భూమి పుత్రులకి భూమి దక్కకుండా చేశారు. భూమికోసం జాతులకు జాతులనే నిర్మూలించి అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, ఆసియా ఖండాలంటూ భూమిని ఖండఖండాలుగా చేసుకొని పంచుకున్నారు. మానవ సమూహాలు, ఆర్యులు, రష్యాలోని ఓల్గా నదీతీరం నుండి గంగ వరకు వచ్చారు. పచ్చిక భూమలు కోసమే కథ. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రజలకు దక్కాల్సిన భూములు గుంజుకుని దేశ, విదేశీ బహుళజాతి కంపెనీలకు, బడాబాబులకు కట్టబెడుతున్నారు. వీరు భూమి సంబంధాలన్నీ మార్కెట్ సంబంధాలుగా మార్చారు. నేడు ప్రపంచంలో చర్చంతా భూమిపైనే. రియల్‌ఎస్టేట్ పేరుతో సాగుతున్న భూ వ్యాపారం ఇవాళ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆక్సిజన్‌గా మారింది. భూమి అంటే నేల మాత్రమేకాదు. ఆ నేలలోని వనరులు, ఈ మట్టిలో నుంచి శ్రమజీవులు పుట్టించిన సమస్త జ్ఞానం, సమిష్టి జీవనం, కళలు, సంస్కృతిగల భూమి నిమ్నజాతులకు దక్కాలి. ఇదే ఏకైక పరిష్కారం. ఇది జరగాలంటే అణగారిన వర్గాల ప్రజలే ఏకమై ఉద్యమించాలి. చైనా, క్యూబా తరహా సోషలిజంను ఈ దేశంలో స్థాపించుకోవాలి.

షేక్ కరీముల్లా, 9705450705

కొండమీది దేముడు

రా బావ ఏంటి ఈ రోజు కోపంగా పళ్లు బిగించి మరీ వస్తున్నావు. ఏముంటుంది ప్రతిరోజు దినపత్రిక చదివిన తరువాత మనసున్న ప్రతి వాడికి కోపం రావడమో, దు:ఖం రావడమో తప్పదు గదా. అది సరే ఈ రోజు కోపానికి కారణం ఏం చదివావు అసలేం జరిగింది. నీకేమయ్యా నిదానంగా తాపీగా ఏం జరిగిందంటావు. నాకే గనుక ఒక నెల ముఖ్యమంత్రి పదవి అప్పచెప్తే ఇటువంటి సనాతన వాదుల్ని, మూఢ నమ్మకాలు వ్యాప్తిచేసేవారిని మొత్తం కట్టగట్టి జైల్లో పెడతాను. లేకపోతే హిట్లరులాగ కాల్చివేస్తా. నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేసినట్లు ఓట్ల కోసం ప్రజల్ని మూఢనమ్మకాల్లో ముంచెత్తే రాజకీయ నాయకుల్ని పిట్టల్లాగ కాల్చివేస్తా అబ్బో చాలా కోపంగా ఉన్నారు. కొంచెం కూల్‌గావయ్యా. ఇప్పుడు విను రాజకీయ నాయకులు ఓట్ల కోసం ప్రజల్ని మూఢనమ్మకాలతో ముంచెత్తే మాట నిజమే. ఈరోజు ఏం చదివావు. నిదానంగా అడుగుతావేంటి బావ. శ్రీకాకుళం జిల్లాలో కొండమీద దేముడు వెలిశాడని గుడికట్టి ప్రతి సంవత్సరం ఉత్సవం పేరిట కొండెక్కలేక జారి పడి కొంతమంది చనిపోతుంటే ప్రభుత్వం మెట్లదారి ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదా. నిజమే మరణాలకు దారితీసే ప్రతి సమస్యపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉంది. ఎక్కువ మంది చేరే ప్రతిచోటా రక్షణ

చర్యలు తీసుకోవలసిన అవసరం ప్రభుత్వానికుంది. అటువంటి దారుణ సంఘటనలు బాధ కలిగించే విషయమే.

అసలు నాకు తెలియక అడుగుతాను. రాష్ట్రపతి, ప్రధాని దగ్గర నుండి శాసనసభ్యులవరకు దైవదర్శనం చేసుకుంటుంటే సామాన్య ప్రజలు వెళ్లకుండా ఉంటారా. ప్రతి అణువుఅణువునా దేముడుంటాడని విస్తృతంగా ప్రచారంచేసే పీఠాధిపతులు చెబుతుంటే ఇంట్లో పూజలతో సరిపెట్టుకోకుండా కొండలమీద, గుట్టలమీద గుళ్లుకట్టి అమాయకుల్ని చంపడం దేనికో. నిజమే మనసు ప్రశాంతత కోసం గతంలో నదుల పక్కనో, పర్వతాలపైనా గుళ్లు కడితే ప్రస్తుతం ప్రతి రోడ్డుపైన గుడి కట్టడం ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించడాలు ఎక్కువైంది. చివరకు సినిమా స్టార్లు ఇంటిలోనే గుడి కట్టడం కూడా చూస్తున్నాం. అది సరే ఇంట్లో గుడిలోని ఫొటోలో లేని దేముడు గుడిలో ఉంటాడా. ఇది చివరకు వ్యాపారంగా మారింది. పత్రికల వాళ్లను ప్రలోభపెట్టి ఒక రాయిచూపించి దేముడు వెలిశాడని రాయించి ప్రచారం చేయించి జన ప్రవాహం పెరిగిన తరువాత లక్షల్లో సంపాదించడం మొదలైన కొన్నాళ్లకు తప్పనిసరై దేవాదాయ శాఖకు అప్పగించడం ఇదంతా వ్యాపారంగా మారింది. గుడి కట్టి సంపాదన మొదలైన తరువాత స్థానిక ప్రజా నాయకుడికి వాటా ఇవ్వడం, ఇదంతా బైటపడిన తరువాత పత్రికలలో వచ్చిన తరువాత తీరుబడిగా దేవాదాయ శాఖ అధికారులు వచ్చి దాన్ని హంగామా చేయడం ఇదంతా ఒక ప్రక్రియలాగ జరిగిపోతోంది బావ. నిజమే అంతెందుకు ప్రతి సంవత్సరం కేదారనాథ్, బద్రీనాద్ యాత్రకు వెళ్లి ఎంతోమంది కొట్టుకుపోయి చనిపోతున్నారు. అప్పటికీ అక్కడి అధికారులు కొంతకాలందర్శనం ఆపివేస్తారు. అక్కడ నడవలేక డోలీలలో వెడతారు. మోసేవారు అడిగినంత ఇవ్వాలి. గతంలో కాశీకి వెళ్లినవారు కాటికి వెళ్లినట్లే అనేవారు. అడవిమార్గాన నెలల తరబడి నడిచివెళ్లి దారిలో చాలామంది మృతి చెందేవారు. తిరిగి వచ్చిన వారు పునర్జన్మగా భావించి బంధువులకు విందు ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు బదరీనాథ్ యాత్ర ఆ కోవలోకి వచ్చింది. ప్రస్తుతం తిరుపతికి వెళ్లని వారుండరేమో అనే విధంగా తాకిడిచూస్తున్నాం. నిజమేబావ మనిషిని నిర్లక్ష్యంచేసి దేవుని చుట్టూ తిరుగుతున్నా అందుకే వరహాలరావు అంటాడు తాను మనిషిని ప్రేమిస్తాగాని మనిషి చెక్కిన రాతి బొమ్మను కాదంటాడు. నీవు చదివావో లేదో ఒక శిల్పి నెలల తరబడి చెక్కిన విగ్రహాన్ని చూసిన స్వార్థపరులు దాన్ని తీసికెళ్లి గుడికట్టి సంపాదించాలని దొంగిలిస్తుంటే అవిగ్రహాన్ని తీసుకువెళ్లే బండికి అడ్డంపడి స్వామి స్వామి అంటూ అరుస్తుంటే బండి చక్రాలకిందపడి రెండుకాళ్లుపోయినా ఆ స్వార్థశక్తులు పట్టించుకోలేదని హృదయం ద్రవించేలా మోదుకూరి జాన్సన్ ఒక నాటకం రాశాడు.

ఇంతకూ దేముడు మనిషిని పుట్టించాడా లేక మనిషే దేముడ్ని తయారు చేశాడా అనేది నాకు పెద్దసందేహం. ఇందులో సందేహించే దేముంది? ఏ విగ్రహం చెక్కినా ఆ విగ్రహాన్ని ప్రతిష్టించి గుడికట్టినా అన్నీ మనిషే. ఇందులో భిన్న వాక్కులకు చోటులేదు. అది సరే ఒక విశ్వబ్రాహ్మణుడు ఎంతో కష్టపడి ఒక దేవత విగ్రహం తయారుచేస్తే దాన్ని ఆ ఊరుపెత్తందార్లు దాన్ని ప్రతిష్టించి గుడి కట్టారు. ఆ తరువాత ఆ ఊరి ప్రజలంతా వెళ్లి పూజలు చేస్తుంటే సదరు విశ్వ బ్రాహ్మణుడు పూజలు చేయలేదు సరికదా ఆ దేవతకు నమస్కారం కూడా చేయకపోవడం గమనించి గ్రామస్తులు ఆయన్ని అడగ్గా నేనుచేసిన రాతి బొమ్మకు నేను నమస్కరించడమేమిటన్నాడట. దాంతో ఆగ్రహించిన పెత్తందార్లు సదరు శిల్పిని గ్రామ బహిష్కరణ చేశారట. అది సరే బావ మనిషి చేసిన బొమ్మకున్న విలువ మనిషికి లేకుండా పోయింది. గుడి నిర్మాణానికి అయితే చందాలిస్తారు. గాని అకలితో అలమటించేవాడికి గుప్పెడన్నం పెట్టరు. పేదవాని పిల్లల చదువుకు రూపాయి కూడా యివ్వరు. కేవలం ఒంగి నమస్కారం చేసి గుడిలో భోజనాలు చేసినంత మాత్రాన దేముడు కరుణిస్తాడా. అసలు కన్పించని దేముడు కరుణిస్తాడా!. కనిపించే కరుణామయుడే కరుణిస్తాడు. మనిషి చేసిన బొమ్మకు మనిషే దాసోహం అనడం మంచిది కాదు. ప్రతి మనిషి సాటి మనిషిని ప్రేమించి ఆదుకోవడమే మనిషి లక్షణంగా మారాలి.

వ్యాస రచయిత సెల్:9885569394

చట్టం అందరికీ ఒకటి కాదా!!

ఐ-మెయిల్

ఇప్పుడున్న వ్యవస్థలలో న్యాయవ్యవస్థ ఒకటి మాత్రమే బాగా పనిచేస్తుంది అని ప్రజలు భావిస్తున్నారు. అయితే నిన్న కోడి కత్తి కేసులో ముఖ్యమంత్రి తాను కోర్టుకివస్తే ట్రాఫిక్ జామ్ అవుతుంది అందువలన తన తరపున లాయర్ మాట్లాడతాడు అని చెప్పటం కొంచెం ఎబ్బెట్టుగా ఉంది. ఎందుకంటే గతంలో ఎన్నోసార్లు ముఖ్యమంత్రి పర్యటనల వల్ల ట్రాఫిక్ జామ్ అయిన సంఘటనలు ఉన్నాయి. నాలాంటివ్యక్తి ఎపుడైనా కోర్టుకి వెళ్ళాల్సివస్తే నాకు బస్సుకి డబ్బులు లేవు, నేను రాలేను అంటే కోర్టు ఊరుకుంటుందా? ఒకసారి విజయవాడలో ముఖ్యమంత్రి ఏదో కార్యక్రమం వలన గుంటూరు-విజయవాడ మధ్య ప్రయాణం మూడు గంటలు పట్టింది. అపుడు ఏమైంది ఈ ట్రాఫిక్ జామ్? షాపులు మూయించి బారికేడ్లు కట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించినపుడు ఏమైంది ? అపుడు గుర్తుకి రాలేదా ఈ ట్రాఫిక్ జాం! హైదరాబాద్ కోర్టుకి వెళ్లాలంటే 60 లక్షలు ప్రజాధనం ఖర్చు అవుతుందని నాంపల్లి కోర్టుకి ఎన్నిసార్లు ఎగనామం పెట్టలేదు ? ప్రజాధనంతో తనసొంత కేసులకు లాయర్లను ఉపయోగించి కోట్లు కోట్లు ఖర్చుపెట్టినపుడు ఈ 60 లక్షలు గుర్తుకి రాలేదా ! అయినా తనమీద ఎవరో కత్తితో దాడిచేసి, గాయపరిచిన కేసులో విజయవాడ కోర్టుకు వెళ్లి తనను కత్తితో ఎలా పొడిచింది చెప్పాలి గదా కోర్టుకి? మరి ఎందుకు వెళ్ళలేదు? ట్రాఫిక్ జామ్‌తో ప్రజలకు కలిగే ఇబ్బందులపై ముఖ్యమంత్రికి అవగాహన ఉంటే భవిష్యత్తులో ట్రాఫిక్ జామ్ కాకుండా ఒకప్రక్క ముఖ్యమంత్రి పోతుంటే, రెండో ప్రక్క ట్రాఫిక్‌కి మాములుగా అనుమతి ఇవ్వండి. ట్రాఫిక్ జామ్ అవ్వకుండా చూడండి. తాను కోర్టుకి వెళ్లాల్సివస్తే ట్రాఫిక్ జామ్, ఏదైనా ప్రారంభోత్సవాలకు మాత్రం జామ్‌లు ఉండాలా ! అందరికి ఒకే న్యాయం ఉండాలి.

నార్నె వెంకటసుబ్బయ్య

తిరుగుబాట్లు...రాజీనామాలు

- కన్నడనాట బీజేపీకి కొత్త తలనొప్పి
- మరో ఏడుగురికి మొండిచేయి
- తేలని శెట్టర్ భవితవ్యం
- మరో ఎమ్మెల్యే రాజీనామా
- యడియూరప్ప బుజ్జగింపులు

బెంగళూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టికెట్ల రగడ కొనసాగుతోంది. టికెట్లు రాని బీజేపీ నేతలు తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. కొంతమంది అలక బూనుతుంటే మరికొంతమంది ఏకంగా బీజేపీ అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పార్టీకి రాజీనామా చేస్తున్నారు. పక్కపార్టీల వైపు చూస్తున్నారు. మొత్తంగా బీజేపీకి అభ్యర్థుల జాబితా పెద్ద తలనొప్పిగా మారింది. రెండు విడతలుగా విడుదల చేసిన అభ్యర్థుల జాబితా అసమ్మతి సెగను రాజేసింది. అవినీతి ఆరోపణలు, అసంతృప్తిని తగ్గించుకునేందుకు అధిష్టానం ప్రక్షాళన చేపట్టగా...ఇది తిరుగుబాటును లేవనెత్తింది. టికెట్లపై గంపెడాశలు పెట్టుకున్న సీనియర్లు భంగపాటుకు గురై రాజీనామాల పర్వానికి దిగడం కాషాయానికి 'కొత్త' తలనొప్పి తెచ్చిపెట్టింది. దీంతో పరిష్కారం కోసం బీజేపీ...పార్టీ సీనియర్ నేత యడియూరప్ప వైపు చూస్తోంది. తిరుగుబాటుదారులను బుజ్జగించేందుకు మాజీ సీఎం యడియూరప్పను రంగంలోకి దింపింది.

దక్షిణాదిలో అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం కర్నాటకను నిలబెట్టుకునేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన సీనియర్లను పక్కనపెట్టి చాలామంది కొత్తవారికి అవకాశాలు కల్పించింది. 189 మందితో విడుదల చేసిన తొలి జాబితాలో 52 మంది కొత్త అభ్యర్థులకు టికెట్లు ఇవ్వగా...బుధవారం విడుదల చేసిన రెండో జాబితాలోనూ ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మొండిచేయి చూపింది. 23 మందితో బీజేపీ రెండో జాబితా విడుదల చేసింది. ఇటీవల అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఎమ్మెల్యే విరూపాక్షప్ప సహా ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పార్టీ టికెట్లు నిరాకరించింది. కాగా రెండో జాబితాలోనూ మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్‌కు చోటు దక్కలేదు. ఆయన పోటీ చేయాలని భావిస్తున్న హుబ్బళి-ధార్వాడ్ స్థానానికి ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదు. తనకు టికెట్ కేటాయించకపోతే రెబల్‌గా పోటీ చేస్తానని ఇప్పటికే ఆయన ప్రకటించారు. టికెట్ కోసం చివరి ప్రయత్నమంటూ నిన్న శెట్టర్...ఢిల్లీ వెళ్లి పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. అయినా రెండో జాబితాలోనూ ఆయనకు చోటు దక్కలేదు. ప్రభావవంతమైన లింగాయత్ నేత అయిన శెట్టర్‌కు టికెట్ ఇవ్వాలని యడియూరప్ప సైతం అధిష్టానానికి సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. తొలి విడత అభ్యర్థుల జాబితాను ప్రకటించిన తర్వాత బీజేపీ కీలక నేత, ఎమ్మెల్సీ లక్ష్మణ్ సవాది పార్టీకి రాజీనామా చేశారు. తాజాగా మరో ఎమ్మెల్యే కూడా అదే బాట పట్టారు. టికెట్ దక్కకపోవడంతో అసంతృప్తికి గురైన ముదిగెరె ఎమ్మెల్యే కుమారస్వామి...పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

పార్టీ నేతల్లో అసంతృప్తుల సంఖ్య పెరుగుతుండటంతో యడియూరప్పను బీజేపీ అధిష్టానం రంగంలోకి దించింది. అసమ్మతి నేతలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించే బాధ్యతను ఆయన భుజానవేసింది. ఈ విషయమై ఇప్పటికే జేపీ నడ్డా యడియూరప్పతో ఫోన్లో మాట్లాడినట్లు తెలుస్తోంది. టికెట్లు దక్కని నేతలతో ముఖాముఖి సమావేశమై బుజ్జగించాలని యడియూరప్పను కోరినట్లు తెలుస్తోంది. అసమ్మతి నేతలతో యడియూరప్పకు సత్సంబంధాలున్నాయి. యడియూరప్ప కూడా తన శక్తిమేర ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చినట్లు సమాచారం.

మిత్రుల ఖజానా నింపడమే కేంద్రం లక్ష్యం: రాహుల్

న్యూఢిల్లీ: పేద, మధ్యతరగతి ప్రజల ఆదాయాలు పడిపోతున్నట్లు వస్తున్న వార్తలపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించారు. మోదీ సర్కారు అనుసరిస్తున్న విధానాల కారణంగానే సామాన్యుల ఆదాయం పడిపోతోందని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వల్ల ప్రజలు ఎంత మేరకు బాధపడుతున్నారన్నది మోదీ సర్కారుకు పట్టడం లేదని, తమ మిత్రుల ఖజానా నింపడమే సూటుబూటు ప్రభుత్వ లక్ష్యమని రాహుల్ విమర్శించారు. ఇండియా కన్స్యూమర్ ఎకానమీ 360 సర్వే వెల్లడించిన సామాన్యుల తలసరి ఆదాయం వృద్ధికి సంబంధించిన వ్యాసాన్ని రాహుల్ గురువారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 2016-21 మధ్యకాలంలో పేదల ఆదాయం 50శాతం, మధ్య తరగతి ఆదాయం 10శాతం తగ్గిందని, అదేసమయంలో సంపన్నుల ఆదాయం 40శాతం పెరిగినట్లు ఇండియా కన్స్యూమర్ ఎకానమీ 360 సర్వే వెల్లడించింది. కూలీలు, కార్మికుల వేతనాల వృద్ధిరేటుపై ఆ వ్యాసం ఆందోళన వెలిబుచ్చింది. దీనిని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. అయితే, గడచిన ఐదేళ్లలో అదానీ ఆదాయం 1440 శాతం పెరిగిందని పేర్కొన్నారు.

కేంద్రమంత్రి షెకావత్‌కు ఊరట

జోధ్‌పూర్: సంజీవని పరపతి సహకార సంఘం కేసులో కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్‌కు రాజస్థాన్ హైకోర్టు గురువారం ఊరట కల్పించింది. షెకావత్ అరెస్టుపై స్టే విధించింది. ఇది రూ.900 కోట్లకు పైగా కుంభకోణం. ఈ కేసును రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మంత్రి షెకావత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయనప్పటికీ...ఆయనపై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయన ఈ కేసు నుంచి తనకు ఊరట కల్పించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మంత్రి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కుల్దీప్ మాథుర్ విచారణ జరిపి...అరెస్టుపై స్టే విధించారు. కేసు తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేశారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని, దర్యాప్తు బాధ్యతలు సీబీఐకి బదిలీ చేయాలని షెకావత్ పిటిషన్‌లో కోరారు. ఈ కేసు రాష్ట్ర పరిధిలోనిది కాదని, అందువల్ల దీనిని సీబీఐకి అప్పగించాలని కోరినట్లు షెకావత్ తరపు న్యాయవాది ధీరేంద్రసింగ్ దస్పన్ చెప్పారు. షెకావత్, ఆయన కుటుంబం పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడిందని, డిపాజిట్‌దారుల డబ్బును తమ ఖాతాలకు మళ్లించుకున్నారని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ పదేపదే విమర్శలు చేస్తుండటంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. గెహ్లోత్‌పై ఢిల్లీ కోర్టు ఆయన పరువునష్టం దావా కూడా వేశారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగేలా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కాగా, సంజీవని క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ కేసుతో సంబంధం ఉన్నందున కేంద్రమంత్రిగా షెకావత్‌ను తొలగించాలని ప్రధాని నరేంద్రమోదీని అశోక్ గెహ్లోత్ గురువారం డిమాండ్ చేశారు. కేంద్రమంత్రిగా కొనసాగే నైతికహక్కు షెకావత్‌కు లేదని ఆయన పేర్కొన్నారు.

అన్నీ తప్పుడు లెక్కలు

- క్రైస్తవులపై దాడుల కేసులో కేంద్రం వాదన
- ప్రభుత్వ నివేదికపై స్పందించేందుకు పిటిషనర్లకు మూడు వారాలిచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: దేశంలో క్రైస్తవులు, మతగురువులు, సంస్థలపై జరిగిన దాడులపై పిటిషన్లలో ఉన్నవి తప్పుడు లెక్కలని కేంద్రప్రభుత్వం గురువారం సుప్రీంకోర్టులో వాదించింది. ఆ మేరకు ఉన్న సమాచారాన్ని తోసిపుచ్చింది. దేశానికి అప్రతిష్ఠ తెచ్చే ఉద్దేశంతో తప్పుడు సమాచారం ఆధారంగా పిటిషనర్లు ఫిర్యాదు చేశారని ఆరోపించింది. 2021 నుంచి 2022 మే వరకు క్రైస్తవులపై 700 హింస కేసులు నమోదు అయ్యాయని, ఈ మతాన్ని నమ్మే అనేకమంది అరెస్టుకు గురయ్యారని పిటిషనర్లు పేర్కొన్నారు. నేషనల్ సాలిడరిటీ ఫోరానికి చెందిన రెవరెంట్ పీటర్ మచాడో, ఇవాంజెలికల్ ఫెల్లోషిప్ ఆఫ్ ఇండియాకు చెందిన రెవరెంట్ విజయేశ్ లాల్ తదితరులు క్రైస్తవులపై దాడుల మీద సుప్రీంకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. కేంద్రప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. బీహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల కేస్‌డేటాపై నివేదికను అందజేశారు. ఇరుగుపొరుగు వారితో గొడవలకు సంబంధించిన కేసులే ఆ రాష్ట్రాల్లో ఎక్కువగా నమోదైనట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే అందులో ఓ పార్టీది క్రైస్తవ మతం కావడం యాధృచ్ఛికమన్నారు. 'క్రైస్తవులపై 500 దాడులు జరిగినట్లు పిటిషనర్ పేర్కొన్నారు. కానీ ఒక్క బీహార్‌లో 38 ఘటనలు జరిగితే అందులో దాదాపు అన్నీ ఇరుగు-పొరుగు వారి మధ్య గొడవలే ఉన్నాయి.

అటు ఛత్తీస్‌గఢ్‌లో 64 మంది అరెస్టు అయ్యారు. కానీ ఆ రాష్ట్రంలో క్రైస్తవులు, వారి సంస్థలపై 495 దాడులు జరిగినట్లు పిటిషనర్లు తప్పుడు సమాచారాన్ని కోర్టుకు ఇచ్చారు. నివేదికలను చూస్తే అక్కడ అలాంటివి జరిగిన దాఖలాలే లేవు. ఇదంతా దేశ ప్రతిష్ఠను దిగజార్చి, క్రైస్తవులు ప్రమాదంలో ఉన్నారని, వారిపై దాడులు జరుగుతున్నాయని బయట ప్రపంచం అనుకునేలా మభ్యపెట్టేందుకు పిటిషనర్లు యత్నించారని మెహతా ఆరోపించారు. దీంతో కేంద్రం సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం దీనిపై పిటిషన్ల వివరణను కోరింది. అందుకోసం మూడు వారాల గడువు ఇచ్చింది.

భటిండాలో మళ్లీ కలకలం

బుల్లెట్ గాయంతో మరో జవాన్ మృతి

చండీగఢ్: పంజాబ్ లోని అత్యంత కీలకమైన భటిండా సైనిక స్థావరంలో కాల్పులు జరిగిన కొద్ది గంటల్లోనే చోటు చేసుకున్న మరో ఘటనలో ఒక జవాను ప్రాణాలు కోల్పోయాడు. బుధవారం సాయంత్రం ఓ జవాను బుల్లెట్ గాయంతో మృతిచెందినట్లు ఆర్మీ అధికారులు వెల్లడించారు. తాజా ఘటనకు అంతకుముందు జరిగిన కాల్పులతో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఈ జవాను ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ఏదైనా ప్రమాదం జరిగిందా? అన్నదానిపై స్పష్టత లేదు. ప్రమాదవశాత్తూ తుపాకీ పేలడంతో మరణించి ఉంటాడని ఆర్మీ అధికారులు అనుమానిస్తున్నారు. మృతుడిని సెంట్రీ విధులు నిర్వర్తిస్తున్న లఘు రాజ్ శంకర్‌గా గుర్తించారు. శంకర్ ఏప్రిల్ 11నే సెలవులు పూర్తిచేసుకుని వచ్చి తిరిగి విధుల్లో చేరినట్లు అధికారులు వెల్లడించారు. "బుధవారం సాయంత్రం సెంట్రీ విధుల్లో ఉన్న శంకర్ కుడి కణతి వద్ద బుల్లెట్ గాయంతో విగతజీవిగా కన్పించాడు. పక్కనే సర్వీసు రివాల్వర్ పడిపోయి ఉంది. శంకర్ ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చు లేదా ప్రమాదవశాత్తూ తుపాకీ పేలి చనిపోయే అవకాశం కూడా ఉంది" అని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

ఒక్కరోజే 10 వేల కరోనా కొత్త కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా 230 రోజుల అత్యధికానికి చేరాయి. కొత్తగా 2,29,958 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 10,158 మందికి వైరస్ సోకినట్లు తేలిందని కేంద్ర ఆరోగ్యశాఖ గురువారం తెలిపింది. కరోనా కేసులు అంతకుముందు 24 గంటల కంటే 30 శాతం మేర అధికంగా కేసులు నమోదయ్యాయి. పాజిటివిటీ రేటు 4.42శాతానికి చేరింది. వైరస్ వ్యాప్తి పెరుగుతుండటంతో క్రియాశీల కేసులు 44,998(0.10శాతం)కి చేరాయి. రికవరీ రేటు 98.71 శాతంగా ఉంది. మన దేశంలో కోవిడ్ అంతిమ దశకు చేరుకుందని బుధవారం అధికార వర్గాలు ప్రకటించాయి. ఈ క్రమంలో మరో 10-12 రోజులపాటు కేసుల ఉధృతి కొనసాగుతుందనీ ఆ తరువాత తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నాయి.

'చాలా ఆలస్యం... చాలా తక్కువ'

మోదీ రోజ్‌గార్ మేళాపై కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ: ప్రధానికి పరిపాలన అంటే తమాషాలా ఉన్నదని కాంగ్రెస్ గురువారం ఘాటుగా విమర్శించింది. తాజాగా రోజ్‌గార్ మేళా కింద కొత్తగా నియామక పత్రాలను పంపిణీ చేయడంపై కాంగ్రెస్ స్పందించింది. 'చాలా అలస్యంగా... చాలా తక్కువగా' పనిచేశారని, పరిపాలన పదవ ఏటా ఈ 'స్టంట్' చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. రోజ్‌గార్ మేళాలో వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాల్లో 71,506 మందిని నియమిస్తున్నట్లు పత్రాలను మోదీ అందజేశారు. దీనిపై ఖర్గే ట్విట్టర్‌లో విమర్శలు గుప్పించారు. 'ఉపాధి పేరుమీద నియామక పత్రాలను మోదీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో 50వేల పత్రాలు ఒక్క రైల్వేశాఖకు సంబంధించినవి ఉన్నాయి. రైల్వేలో ఉన్న ఖాళీలు 3,01,750. వేర్వేరు ప్రభుత్వ శాఖల్లో 30లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి' అని ఖర్గే హిందీలో ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ 'తొమ్మిదేళ్లలో లక్షలాది ఎంఎస్ఎంఈలను మూసివేసిన పర్యవసానంగా ఏర్పడిన నిరుద్యోగానికి మోదీ రోజ్‌గార్ మేళ ఓ స్మారకంలా తోస్తోంది' అని వ్యాఖ్యానించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగంపై మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎప్పటికప్పుడు విమర్శిస్తుండటం విదితమే.

అది బూటకపు ఎన్‌కౌంటర్

అసద్ మృతిపై అఖిలేశ్

లక్నో: గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ కుమారుడు అసద్‌ను పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సంచలనం రేపింది. ఇటీవల దారుణ హత్యకు గురైన ఉమేశ్‌పాల్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అసద్, మరో నిందితుడిని పోలీసులు ఎన్‌కౌంటర్‌లో కాల్చివేశారు. ఈ ఎన్‌కౌంటర్‌పై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ స్పందించారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్‌గా పేర్కొన్నారు. "ఇలాంటి నకిలీ ఎన్‌కౌంటర్లతో అసలు సమస్యల నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. న్యాయ వ్యవస్థపై ఆ పార్టీకి విశ్వాసం లేదు. నేటి ఎన్‌కౌంటర్‌తో పాటు ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్ ఘటనలపై సమగ్రంగా దర్యాప్తు జరిపించాలి. అసలు నేరస్థులను వదిలిపెట్టకూడదు. ఏది సరైందో ఏది తప్పో నిర్ణయించే హక్కు ప్రభుత్వానికి లేదు" అని అఖిలేశ్ పేర్కొన్నారు.

విచారణకు మాయావతి డిమాండ్: అసద్ అహ్మద్ ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి గురువారం డిమాండ్ చేశారు. అసద్ అహ్మద్ ఎన్‌కౌంటర్‌పై వాస్తవాలు వెలుగులోకి వచ్చేందుకు విచారణ చేపట్టాలని ఆమె కోరారు. అతిక్ అహ్మద్ కుమారుడు, ఇతరుల ఎన్‌కౌంటర్‌పై ప్రజల్లో చర్చ జరుగుతున్నదని, వికాస్ దూబే ఘటన పునరావృతమవుతుందన్న భయాందోళన నిజమవుతోందని ప్రజలు భావిస్తున్నారని మాయావతి పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి వాస్తవాలు ప్రజలకు తెలిసేలా అత్యున్నత స్థాయి దర్యాప్తు జరిపించడం అవసరమని ఆమె ట్వీట్ చేశారు.

యూపీలో దారుణం

మేనేజర్‌ను కొట్టి చంపారు

షాజహాన్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. షాజహాన్‌పూర్‌లో ట్రాన్స్‌పోర్టు వ్యాపారవేత్త బంకిమ్ సూరి తన వద్ద పనిచేసే మేనేజర్‌ను చితక్కొట్టి చంపేసి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి ముందు పడేశారు. ట్రాన్స్‌పోర్టు వ్యాపారవేత్త వద్ద శివమ్ జోరీ అనే వ్యక్తి మేనేజర్‌గా చేస్తున్నాడు. అయితే ఒక పార్సిల్ కనపడకుండా పోయిన విషయంలో జోరిపై ఆ కంపెనీ యజమానులు దాడి చేశారు. ఒక స్తంభానికి కట్టేసి మరీ జోరిని రాడుతో చిదకబాదారు. మేనేజర్ జోరి దొంగతనం చేసి ఉంటాడని కొట్టారు. మెడికల్ కాలేజీ వద్ద శవాన్ని పడేసినట్లు పోలీసులు గుర్తించారు. కరెంటు షాక్ వల్ల జోరి చనిపోయినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. అయితే మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు ఆ వ్యక్తికి గాయాలైనట్లు గుర్తించారు. దీంతో దర్యాప్తు మొదలుపెట్టారు. గత ఏడేళ్ల నుంచి బంకిమ్ సూరి వద్ద జోరి పనిచేస్తున్నాడు. ఇటీవల ప్రముఖ వ్యాపారవేత్త కన్నయ్య హాజరీకి చెందిన ఓ పార్శిల్ కనపడలేదు. ఆ పార్శిల్ విషయంలో అనుమానం వచ్చిన ప్రతి ఉద్యోగిపై దాడి చేసినట్లు తెలుస్తోంది. మేనేజర్ జోరి హత్య కేసులో కన్నయ్య దుకాణం యజమాని నీరజ్ గుప్తా కూడా ఉన్నారు. మొత్తం ఏడుగురిపై హత్య కేసు నమోదయింది. పోస్టుమార్టమ్‌లో మరిన్ని వాస్తవాలు బయటపడుతాయని భావిస్తున్నారు.

ప్రభుత్వం ఆమోదించని

రంగనాథ్ మిశ్రా నివేదికపై ఆధారపడవచ్చా?

- కమిషన్ స్పందించే వరకు వేచి ఉండాలా?
- రాజ్యాంగ అంశాలను పరిశీలిస్తున్నప్పుడు కళ్లు మూసుకోలేం
- దళిత ముస్లింలు, క్రైస్తవుల కోటాపై సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: దళిత ముస్లింలు, దళిత క్రైస్తవులకు కోటా ప్రశ్నను పరిశీలిస్తున్నప్పుడు సుప్రీం కోర్టు బుధవారం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తిరస్కరించిన లేదా ఆమోదించని విచారణ కమిషన్ నివేదిక ప్రభావం ఏమిటి?, రాజ్యాంగ సమస్యను నిర్ణయించేటప్పుడు నివేదిక ఆధారంగా రూపొందించిన అనుభావిక సమాచారాన్ని పరిశీలించవచ్చా అని వ్యాఖ్యానించింది. దళిత ముస్లింలు, దళిత క్రైస్తవులను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలని రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సు చేసిన నివేదికను కోర్టు ప్రస్తావించింది. ప్రభుత్వం ఈ నివేదికను ఆమోదించలేదని, అది 'లోపభూయిష్టంగా' ఉందని పేర్కొంది. హిందూ మతం, సిక్కు మతం, బౌద్ధ మతం కాకుండా ఇతర మతాలలోకి మారిన షెడ్యూల్డ్ కులాల పట్ల రాజ్యాంగం (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వు 1950 వివక్షతో కూడుకున్నదని, ఆర్టికల్ 14 (చట్టం ముందు సమానత్వం), 15 (మతం, జాతి, కులం మొదలైన వాటి ఆధారంగా వివక్షను నిషేధించడం) ఆరోపించిన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించింది. రాజ్యాంగం (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్ 1950 కాలానుగుణంగా సవరించబడింది. హిందూ మతం, సిక్కు మతం, బౌద్ధమతం కాకుండా ఇతర మతాన్ని ప్రకటించే ఏ వ్యక్తిని షెడ్యూల్డ్ కులం (ఎస్సీ) సభ్యుడుగా పరిగణించబడదు.

దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలని సిఫారసు చేసిన జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ 2007 నివేదికను ప్రభుత్వం ఆమోదించలేదని పిటిషనర్లలో ఒకరి తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్... జస్టిస్ ఎస్.కె.కౌల్ నేతృత్వంలోని ధర్మాసనానికి తెలిపారు. భారతదేశ మాజీ ప్రధాన న్యాయమూర్తి కె.జి.బాలకృష్ణన్ నేతృత్వంలో కొత్త కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 'ఇప్పుడు వారు (ప్రభుత్వం) మరొక కమిషన్‌ను నియమించినట్లు చెబుతున్నారు. దాని ఆధారంగా కోర్టు ముందుకు సాగడానికి తగినంత మెటీరియల్ ఉంది. ప్రభుత్వం ఒక కమిషన్‌ను నియమించడానికి ఈ కోర్టు పదే పదే వేచి ఉండాలా? లేదు. కమిషన్ నివేదిక కోసం ఈ కోర్టు ఎదురుచూడడానికి కారణం' అని న్యాయమూర్తులు జస్టిస్ ఎ.అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ముందు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పట్టుబట్టారు. కేంద్రం తరపున హాజరయిన అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) కె.ఎం.నటరాజ్, న్యాయమూర్తి జస్టిస్ బాలకృష్ణన్ నేతృత్వంలోని కమిషన్ తన పనిని చేస్తోందని, సంబంధిత మెటీరియల్, సమాచారాన్ని సేకరించవలసి ఉందని తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, 'జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ ఉంది. అది తన నివేదికను ఇచ్చింది. మీరు దానిని అంగీకరించరని మీ విజ్ఞతతో చెప్పారు. మీరు మరొక కమిషన్‌ను ఏర్పాటు చేశారు. కమిషన్ స్పందించే వరకు వేచి ఉండాలా?' అని ధర్మాసనం ప్రశ్నించింది. న్యాయవాది నటరాజ్... సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, వర్గీకరణ అధ్యయనం అవసరమని, సమస్యలోకి వెళ్లడానికి ఏర్పాటయిన కొత్త కమిషన్ ప్రతిస్పందన కోసం కోర్టు వేచి ఉండాలని అన్నారు. మరో పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సి.యు.సింగ్ వాదనలు వినిపిస్తూ, ప్రభుత్వం మరో కమిషన్‌ను నియమించిందేమీ లేదన్నారు. 'ప్రభుత్వం అంగీకరించని విచారణ కమిషన్ నివేదిక పరిస్థితి ఏమిటి?' అని ధర్మాసనం ప్రశ్నించింది. 'నా ప్రశ్న ఏమిటంటే, ఒక నివేదిక ఆమోదించబడకపోతే, నివేదిక లేదా అనుభావిక సమాచారంలో కనుగొన్న వాటి స్థితి ఏమిటి. లేవనెత్తిన రాజ్యాంగ సమస్యను పరిష్కరించడానికి అంగీకరించని నివేదిక నుంచి అనుభావిక సమాచారంపై ఆధారపడగలమా?' అని న్యాయమూర్తి జస్టిస్ కౌల్ తెలుసుకోవాలనుకున్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల్లో ఏదైనా చేర్చడానికి రిట్ జారీ చేయవచ్చా అని కూడా ధర్మాసనం ప్రశ్నించింది. 2004లోనే ఈ పిటిషన్లు దాఖలయ్యాయని పేర్కొన్న న్యాయవాది ప్రశాంత్ భూషణ్... జస్టిస్ మిశ్రా కమిషన్ మెటీరియల్‌ను పరిశీలించి తన నివేదికను అందించడమే కాకుండా, పిటిషనర్లు అనేక అధికారిక అధ్యయనాలను నమోదు చేశారని వాదించారు. కాలక్రమేణా, వేర్వేరు కమిషన్లు ఉండవచ్చు. రాజకీయపరమైన అంశాలు కూడా ఉన్నాయని పిటిషనర్లు చెప్పాలని కోరుతున్నారని ధర్మాసనం గమనించింది. 'సమస్య ఏమిటంటే దాదాపు రెండు దశాబ్దాలు గడిచిపోయాయి' అని ధర్మాసనం పేర్కొంటూ, జస్టిస్ మిశ్రా కమిషన్ నివేదికను ప్రభుత్వం అంగీకరించలేదు, చాలా కమిషన్లు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నాయి. 'ఆశ్చర్యమేమిటంటే, ఎన్ని విచారణ కమిషన్లు వేస్తారో?' అని ప్రశ్నించింది. కాగా న్యాయవాది నటరాజ్ కొత్త కమిషన్ విధివిధానాలను చదివి వినిపించారు. జస్టిస్ మిశ్రా కమిషన్ అన్ని కోణాల్లోకి వెళ్లలేదన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, 'బహుశా మీరు నివేదికను తనిఖీ చేయాల్సి ఉంటుంది. మీరు నివేదికపై చాలా సాధారణమైన ప్రకటన చేస్తున్నారు. నివేదిక అంత పనికిరానిది కాదు' అని ధర్మాసనం పేర్కొంది. సామాజిక వివక్ష, మతపరమైన వివక్ష వేర్వేరు అంశాలని, ఒక వ్యక్తి వేరొక మతంలోకి మారిన తర్వాత కూడా సామాజిక వివక్ష కొనసాగవచ్చన్న విషయాన్ని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. 'రాజ్యాంగపరమైన ప్రశ్నలను పరిశీలిస్తున్నప్పుడు మనం కళ్లు మూసుకోలేం' అని వ్యాఖ్యానించింది. 'రాజ్యాంగపరమైన ప్రశ్నను పరిశీలించడంలో ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే కమిషన్ నివేదికను ప్రభుత్వం ఆమోదించకపోతే దాని ప్రభావం ఎలా ఉంటుంది' అని ప్రశ్నించింది. ప్రభుత్వం నివేదికను ఆమోదించడం లేదా అంగీకరించకపోవడం భౌతికం కాదని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్నారు. '

ప్రభుత్వం తిరస్కరించిన లేదా అంగీకరించని విచారణ కమిషన్ నివేదిక ప్రభావం ఏమిటి అనేది మరొక సమస్య. నివేదిక ఆధారంగా రూపొందించిన అనుభావిక సమాచారాన్ని పరిశీలించవచ్చా....' ఈ అంశాలపై చర్చ అవసరమని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసును జులై 11వ తేదీకి వాయిదా వేసింది. హిందూ మతం, బౌద్ధ మతం, సిక్కు మతాలను అనుసరించే షెడ్యూల్డ్ కులాలకు విస్తరించిన అదే ప్రాతిపదికన మతం మారిన దళితులకు రిజర్వేషన్లు కల్పించాలని ఒక అభ్యర్థన కోరింది.

ఎన్డీయేలో చేరే ప్రసక్తేలేదు

మాంఝీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీయే)లో చేరే ప్రసక్తే లేదని, తాను నితీశ్ కుమార్ వెంటే ఉంటానని ప్రమాణం చేశానని బీహార్ మాజీ ముఖ్యమంత్రి, హిందూస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం) అధ్యక్షుడు జితన్ రామ్ మాంఝీ స్పష్టం చేశారు. గురువారం ఉదయం మాంఝీ ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. హోం మంత్రితో భేటీ అనంతరం బయటకు వచ్చిన మాంఝీని మీరు ఎన్డీయేలో చేరుతున్నారా? అని విలేకరులు ప్రశ్నించగా పైవిధంగా స్పందించారు. ఈ దేశానికి ప్రధానమంత్రి అయ్యే అన్ని అర్హతలు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఉన్నాయని చెప్పారు. నితీశ్ దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నింటిని ఒక్కతాటిపైకి తీసుకొచ్చేందుకు నిజాయితీగా కృషి చేస్తున్నారని మాంఝీ చెప్పారు. అంతకుముందు తన అనుచరులతో కలిసి అమిత్ షాతో భేటీ అయినప్పుడు మాంఝీ ఒక వినతి పత్రం సమర్పించారు. అయితే, తాను ఓ పని విషయంలో మర్యాదపూర్వకంగా హోంమంత్రిని కలిశానని, మా భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని మాంఝీ చెప్పారు.

పేదలకు భూ పంపిణీ అత్యవసరం

వ్యవసాయ కార్మిక సంఘం చర్చా వేదికలో వక్తలు

విశాలాంధ్ర–విజయవాడ: పేదలకు భూ పంపిణీ సామాజిక అవసరమని, అందు కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం అధ్వర్యంలో 'కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు–అమలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన చర్చా వేదిక విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగింది. ముఖ్య అతిథి, ప్రముఖ న్యాయవాది, భూ చట్టాల నిపుణులు ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు పేదలకు భూ పంపిణీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2024 డిసెంబరు నాటికి దేశంలో టైటిల్ గ్యారెంటీ తీసుకురావాలని కేంద్రం నిర్ణయించినట్లు చెప్పారు. ఆ రికార్డుల్లో జరిగిన తప్పులను రెండేళ్లలోపు సరిదిద్దుకోకపోతే టైటిల్ గ్యారెంటీ రిజిస్టర్‌లో మార్పు చేసే అవకాశమే లేదన్నారు. టైటిల్ ఇన్సూరెన్సు, పంట సాగు చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. 2004లో ప్రపంచ బ్యాంక్ భారత్ అభివృద్ధి భూ విధానంపై నివేదిక ఇచ్చిందన్నారు. భూముల రక్షణ కోసం నియమాలు పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి ఎకరం భూమి ఇచ్చే అవకాశం ఉందన్నారు. పేదలకు భూ చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి జిల్లాకు ల్యాండ్ ట్రిబ్యునల్, మండలానికి లీగల్ సెల్ ఏర్పాటు చేసి భూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాలన్నారు.

డబ్బు ఖర్చు తప్ప ఉపయోగం లేదు: రామకృష్ణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ జగనన్న కాలనీల కోసం వేలకోట్ల రూపాయలు ఖర్చు చేశారని, అయినా లక్ష్యం నెరవేర్చటం లేదన్నారు. గతం కంటే ఇప్పుడు భూ విలువ భారీగా పెరిగిందన్నారు. దీనివల్ల ఎమ్మెల్యేలు భూమి, ఇసుకపై పడ్డారని ఆరోపించారు. 17ఏళ్ల క్రితం కోనేరు రంగారావు కమిటీ చేసిన సిఫార్సులు నేటికీ అమలు కాకపోవటానికి రాజకీయ పార్టీల ప్రాధాన్యతలు వేరుగా ఉండటమేనన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గ్రామీల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని వామపక్ష పార్టీలు పోరాటం చేసినా సీఎం జగన్ పట్టించుకోలేదన్నారు. కౌలురైతులకు అర్హతా పత్రం ఇచ్చి ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు కౌలురైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు భూ పంపిణీ చేసేందుకు ఐక్యపోరాటాలు అవసరమన్నారు.

భూ పంపిణీతోనే పేదలకు గౌరవం: జల్లి విల్సన్

చర్చా వేదికకు అధ్యక్షత వహించిన వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ భూమిపై కష్టపడే శ్రమజీవికి గౌరవ భృతి, సామాజిక గౌరవం కల్పించటంతో పాటు ఆహార భద్రత ఉండటానికి పేదలకు భూమి పంపిణీ ఒక్కటే మార్గమన్నారు. కోనేరు రంగారావు కమిటీ 104 సిఫార్సులు చేస్తే 74 సిఫార్సులు ఆమోదించారని, మరో 20 సిఫార్సులు కొద్ది సవరణలతో అమలయ్యాయని చెప్పారు. సాగు భూమి పంపిణీ చేయకుండా ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా ఫలితం ఉండదని వివరించారు. పేదలకు పంపిణీ చేయడానికి భూమి ఉందని, కానీ ఆ పనిచేయదానికి పాలకులకు మనసు లేదని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారామ్ మాట్లాడుతూ నేటి యువతకు భూ సమస్యలు అర్థం కావటం లేదన్నారు. ప్రభుత్వాలు ఉద్యోగాలిస్తాయనే భ్రమలో ఉన్నారని చెప్పారు. భూమిని కేంద్రీకరించి అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. 9/77 చట్టాన్ని సవరించి అసైన్డు భూమిని అమ్ముకునే అవకాశం కల్పించారని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రాష్ట్ర మంత్రులకు కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు, జీవోలు తెలియవన్నారు. భూ సీలింగ్ చట్టం అమలు చేస్తే గోదావరి జిల్లాల్లో 12 లక్షల ఎకరాల మిగులు భూమి అందుబాటులోకి వస్తుందన్నారు. ఏఐసీసీ సభ్యులు కొలనుకొండ శివాజీ మాట్లాడుతూ కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల అమలు కోసం ముఖ్యమంత్రికి లేఖ రాయాలని పీసీసీ అధ్యక్షుడిని కోరతానని చెప్పారు. చర్చా వేదిక తీసుకునే భవిష్యత్ కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ చర్చా వేదిక తరపున తీర్మానాలు ప్రవేశపెట్టారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో చేర్చి గ్రామీణ పేదలకు భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు, నివాసముంటున్న ప్రభుత్వ స్థలాలకు అన్ని హక్కులతో పట్టాలు ఇవ్వాలని తీర్మానించారు. పేదలకు అన్యాయం చేసే అసైన్డు భూముల అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన 9/77 అసైన్డు చట్టంలో సెక్షన్–3ని, ఇతర అన్ని సవరణలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని, పేదలకు భూ పంపిణీ చేయాలని కోరుతూ మే మొదటి వారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, రెవెన్యూ శాఖమంత్రికి వినతి పత్రాలు అందజేయాలని తీర్మానించారు. ఈ తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కాంగ్రెస్ పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు కోనేరు తాంతియా కుమారి, విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ రామాంజనేయులు, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ ఎస్.వెంకట సుబ్బయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, దళిత సంఘాల నాయకులు కొరివి వినయ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. చర్చా వేదిక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం నాయకులు ఆర్.వెంకట్రావ్, బి.కేశవరెడ్డి, పి.సుబ్రహ్మణ్యం, ఈశ్వరరావు, చిలుకూరి వెంకటేశ్వరరావు, చిట్టెప్ప, లండా వెంకట్రావ్, కరిశెట్టి వెంకట్రావ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత ఆవుల శేఖర్ స్వాగతం పలకగా, వెంకటేశ్వర్లు వందన సమర్పణ చేశారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ అభ్యుదయగీతం ఆలపించారు.

టిడ్కో ఇళ్లతో రూ.21 వేల కోట్ల లబ్ధి

- టీడీపీ హయాంలో ఒక్కరికీ ఇల్లు ఇవ్వలేదు
- మన ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- గృహనిర్మాణ శాఖ సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: టిడ్కో ఇళ్లపై జరుగుతున్న అసత్య, విష ప్రచారాన్ని తిప్పికొడుతూ వాస్తవాలను ప్రజల ముందుంచాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. 'టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిగా పక్కన పెట్టింది. ఒక్క లబ్ధిదారుడికీ ఇల్లు ఇవ్వలేకపోయింది. మన ప్రభుత్వ హయాంలో వాటిని పూర్తి చేస్తూ... మంచి మౌలిక సదుపాయాలతో లబ్ధిదారులకు అప్పగిస్తున్నాం. దాదాపు టిడ్కో ఇళ్ల రూపంలో లబ్ధిదారులకు రూ.21 వేల కోట్ల విలువైన లబ్ధి చేకూర్చాం. ఈ వాస్తవాలను ప్రజలముందు ఉంచండి' అని సీఎం ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం గృహ నిర్మాణశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలోనూ, ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన పనులు వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. దీనికి సీఎం స్పందిస్తూ ఈ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి వాస్తవాలు తెలియజేయాలని సూచించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో గృహనిర్మాణం కోసం 10,203 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.15,810 కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు తెలిపారు. హౌసింగ్‌పై ఏపీ చేస్తున్న ఖర్చు కొన్ని చిన్న రాష్ట్రాల బడ్జెట్ కన్నా అధికమని, కొన్ని కేంద్ర ప్రభుత్వ శాఖల్లోనూ ఇంత బడ్జెట్ లేదని అధికారులు వివరించారు. పేదలందరికీ ఇళ్లు పథకానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనంగా పేర్కొన్నారు. ఇప్పటివరకూ 3,40,741 ఇళ్లు పూర్తయ్యాయని,శ్లాబ్ పూర్తి చేసుకున్నవి, శ్లాబుకు సిద్ధం చేసినవి...4,67,551 ఇళ్లు ఉన్నాయని, ఇవి కొన్నిరోజుల్లో పూర్తవుతాయని అధికారులు వివరించారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దని సీఎం స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణం జరుగుతున్న జగనన్న కాలనీల్లో కరెంటు, తాగునీరు సహా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అధికారులు తెలియజేయగా, డ్రైనేజీ వ్యవస్థపై దృష్టిపెట్టాలని సీఎం సూచించారు. గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ఏపీ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ లిమిటెడ్ చైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, గృహనిర్మాణశాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్, ఇంధనశాఖ ప్రత్యేక సీఎస్ కె.విజయానంద్, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ మహమ్మద్ దివాన్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ లక్ష్మీషా, టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, మైనింగ్ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ రూ. 500కివ్వాలి

- సంపూర్ణ మద్య నిషేధం కోసం పోరాటానికి సిద్ధం కావాలి
- మహిళా సమాఖ్య రౌండ్‌టేబుల్‌లో వక్తలు

విశాలాంధ్ర–విజయవాడ: బీజేపీ అధికారంలోకి వస్తే గ్యాస్ ధరలు తగ్గిస్తామని యిచ్చిన హామీని అధికారంలోకి వచ్చి 9ఏళ్లు గడిచినా ఎందుకు అమలు చేయటం లేదని మహిళా సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని, రాష్ట్రంలో మద్యం నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు పాల్గొన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన విశ్రాంత జడ్జి లక్ష్మి మాట్లాడుతూ రాజస్థాన్‌లో రూ.500కు గ్యాస్ సిలిండర్ ఇస్తున్నప్పుడు మన రాష్ట్రంలో ఎందుకు అమలు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో నేరాల రేటు పెరగటానికి ప్రధాన కారణం మద్యమేనన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయటంతో పాటు ప్రజల ఆరోగ్యం కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మద్యనిషేధ ఉద్యమాన్ని నాన్‌పొలిటికల్ అంశంగా రూపొందించి అమలు చేయాలని సూచించారు. భారత జాతీయ మహిళా సమాఖ్య నాయకులు అక్కినేని వనజ, మద్యనిషేధ ఉద్యమ నాయకులు మనోరమ మాట్లాడుతూ అనేక సామాజిక సమస్యలకు కారణం మద్యమేనన్నారు. కుటుంబాలు ఆర్థికంగా ఛిన్నాభిన్నం అవుతున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత పెడత్రోవ పడుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యపానంవల్ల భర్తను కోల్పోయిన అనేకమంది మహిళలు ఒంటరిగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో మద్యం పాలసీపై ఈ విధానం ఏమిటని రాజకీయ పార్టీలను నిలదీయాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను తుంగలో తొక్కి గ్యాస్ సిలిండర్ ధరను 200 రెట్లు పెంచాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 25 సంవత్సరాలు మద్యం విక్రయాల ద్వారా ఆదాయం సమకూర్చుకోవటానికి ప్రణాళిక రూపొందించుకున్నదన్నారు. జగన్ ప్రభుత్వం తన సొంత బ్రాండ్‌లతో మద్యం విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని విమర్శించారు. గృహ హింస పెరిగిపోవటానికి మద్యం ప్రధాన కారణం అన్నారు. కృష్ణా–గోదావరి బేసిన్‌లో ఉన్న గ్యాస్ నిక్షేపాలను గుజరాత్‌కు ధారదత్తం చేశారని విమర్శించారు. గ్యాస్ ఇచ్చిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం చేస్తామని చెప్పి బీజేపీ మోసం చేసిందన్నారు. భూగర్భ ఖనిజ సంపదను ఇతర రాష్ట్రాలకు కట్టబెట్టి ఆంధ్రద్రేశ్ ప్రజలపై భారం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వం మద్య నిషేధం దిశగా అడుగులు వేస్తున్నదన్నారు. ఏడాదికి 500 షాపుల చొప్పున తగ్గిస్తూ మద్యాన్ని అంచెలంచెలుగా నిషేధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారనీ 2019 ఎన్నికల ముందు ఇలాంటి హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి మద్యనిషేధం చేయకపోగా వ్యాపారాన్ని మరింత పెంచారని విమర్శించారు. మద్య నియంత్రణ కోసం ఐక్యవేదిక ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

పీఓడబ్ల్యూ నాయకులు గంగాభవాని మాట్లాడుతూ మద్యనిషేధం కోసం, గ్యాస్ ధర తగ్గించటం కోసం సమావేశం తీసుకునే నిర్ణయాలకు మద్దతు ప్రకటించారు.

ఈ సమావేశంలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి.జయలక్ష్మి, కార్యదర్శి పమిడిముక్కల రాణి, విజయవాడ నగర అధ్యక్షకార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ, శ్రామిక మహిళా ఫోరం నాయకులు లక్ష్మీదేవి, ఏఐటీయూసీ నాయకులు శైలజ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖుర్షీదా బేగం తదితరులు పాల్గొన్నారు.

తృణధాన్యాల వినియోగంపై అవగాహన పెంచాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: తృణధాన్యాల వినియోగంపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహనను పెంపొందించాల్సిన అవసరముందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. ఐక్యరాజ్య సమితి 2023 ఏడాదిని అంతర్జాతీయ మిల్లెట్ల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో అంశంపై గురువారం వెలగపూడి సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సీఎస్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ తృణధాన్యాల సాగుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో అనుకూలమైనదని, రాష్ట్రంలో ఈఏడాది లక్షా 27వేల హెక్టార్లలో తృణధాన్యాలను సాగుచేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్టు వివరించారు. తృణధాన్యాలు సాగుచేసే రైతులకు ప్రభుత్వపరంగా తగిన మద్దతు ధరను ఇచ్చి ప్రోత్సహించడంతోపాటు ఆయా ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రాలు, కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు తదితర పట్టణాలన్నింటిలో తృణధాన్యాలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేసి ఆయా ఉత్పత్తులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సూచించారు. తృణధాన్యాల ఉత్పత్తులకు సంబంధించిన ప్రత్యేకస్టాల్ ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి గోపాల కృష్ణ ద్వివేదిని సీఎస్ ఆదేశించారు. ఇకపై ప్రతినెలా తృణధాన్యాలపై రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ, అనుబంధరంగాల అధికారులతో సమీక్షించనున్నట్టు తెలిపారు. జొన్నలు, సజ్జలు, రాగులు వంటి తృణధాన్యాల్లోని పిండి పదార్థాల వల్ల దైనందిన అవసరాలకు సరిపడా 70–80శాతం శక్తిని అందిస్తాయని భారీపరిమాణాల్లో వినియోగిస్తుంటే ఇవి ఇతర పోషకపదార్థాలైన మాంసకృత్తులు, కాల్షియం, ఐరన్, బి–కాంప్లెక్స్ విటమిన్లనూ అందజేస్తాయని వివరించారు. అంతకు ముందు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తృణధాన్యాల సాగు ప్రోత్సాహానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండి వీరపాండ్యన్, మధ్యాహ్నభోజన పథకం డైరెక్టర్, ఆహారశుద్ధి విభాగం సీఈవో తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సంజూ శ్యాంసన్‌కు జరిమానా

చెన్నై: రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శ్యాంసన్‌కు .. ఐపీఎల్ నిర్వాహకులు భారీ జరిమానా విధించారు. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి ఫైన్ విధించారు. ఓవర్ రేట్ విషయంలో ఈ ఏడాది ఐపీఎల్‌లో జరిమానా పడ్డ రెండో కెప్టెన్‌గా శ్యాంసన్ నిలిచాడు. ఆర్సీబీ కెప్టెన్ డూప్లెసిస్‌కు తొలుత జరిమానా విధించిన విషయం తెలిసిందే. అయితే ఈ సీజన్‌లో శ్యాంసన్ తొలి తప్పుగా భావిస్తూ.. అతనికి రూ.12 లక్షల జరిమానా విధించారు. జరిమానాపై ఐపీఎల్ ఓ ప్రకటన జారీ చేసింది. ఒకవేళ మళ్లీ తప్పు చేస్తే, రెండోసారి రూ.24 లక్షల ఫైన్ విధించే అవకాశాలు ఉంటాయి. దీంతో పాటు మిగిలిన 10 మంది ఆటగాళ్లపై కూడా ఫైన్ వేస్తారు. వారిపై ఆరు లక్షలు లేదా 25 శాతం మ్యాచ్ ఫీజును వసూల్ చేస్తారు. ఇక ఒక సీజన్‌లో మూడో సారి స్లో ఓవర్ రేట్ వేస్తే అప్పుడు కెప్టెన్‌కు 30 లక్షల ఫైన్ విధిస్తారు. దీనితో పాటు ఒక మ్యాచ్‌పై బ్యాన్ వేస్తారు. మరో 10 మంది ఆటగాళ్లపై 12 లక్షల ఫైన్ వేస్తారు.

ఇరాక్ ఫుట్‌బాలర్‌పై రెండేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: మైదానంలో దురుసు ప్రవర్తన ఒక ఫుట్‌బాలర్ కొంప ముంచింది. ఏకంగా రెండేళ్ల నిషేధానికి గురయ్యేలా చేసింది. అతని పేరు ఇబ్రహీం బయేష్. ఇరాక్ దేశంలోని అల్–కవా–ల్–జవియా క్లబ్ కు చెందిన మిడ్ ఫీల్డర్. మ్యాచ్ సందర్భంగా తనకు రెడ్ కార్డు ఇచ్చినందుకు అవేశంతో అతను రిఫరీపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఇరాక్ ఫుట్‌బాల్ సంఘం తీవ్రంగా పరిగణించింది. ఇబ్రహీంపై రెండేళ్ల బ్యాన్ విధించింది. 'రిఫరీ మొదటగా ఇబ్రహీంకి ఎల్లో కార్డు చూపించాడు. దాంతో, అతను కోపంగా వెళ్లి రిఫరీని చుట్టుముట్టాడు. అనంతరం రెడ్ కార్డు చూపించగానే ఇబ్రహీం ఆవేశంతో ఊగిపోయాడు. పరుగెత్తుతూ వెళ్లి రిఫరీపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. అంతేకాదు ఇబ్రహీం.. రిఫరీని అవమానించడమే కాకుండా అతడిని బెదిరించాడు' అని అసోసియేషన్ వెల్లడించింది.

6 లక్షల జరిమానా

అల్ షాబ్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో అల్–కవా–ల్–జవియాపై 3–2తో అల్–కహ్రబ క్లబ్ విజయం సాధించింది. అయితే.. అల్–కవా–ల్–జవియా క్లబ్ ఓటమి తట్టుకోలేని ఫ్యాన్స్ ఆందోళనకు దిగారు. స్టేడియంలోని ఫర్నీచర్ ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని కూడా ఇరాక్ ఫుట్‌బాల్ సీరియస్‌గా తీసుకుంది. ఆ క్లబ్ ఆడే తర్వాతి మూడు మ్యాచ్‌లకు అభిమానులను అనుమతించవద్దని నిర్ణయం తీసుకుంది. 10 మిలియమన్ ఇరాకీ దినార్ల(రూ.6 లక్షలు) జరిమానా కూడా విధించింది. అంతేకాదు స్టేడియం ఫర్నీచర్ మరమ్మతు ఖర్చులను చెల్లించాల్సిందిగా క్లబ్‌ను ఆదేశించింది.

అధికార మార్పునే ప్రజలు కోరేది: అఖిలేశ్

ఇండోర్: దేశ ప్రజలు అధికార మార్పును కోరుకుంటున్నారని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. మధ్య ప్రదేశ్ పర్యటనలో ఉన్న అఖిలేశ్ గురువారం విలేకరులతో మాట్లాడిన సందర్భంగా బీజేపీని ఓడించేందుకు మీ పార్టీ మిగతా ప్రతిపక్షాలతో కలుస్తుందా అన్న ప్రశ్నకు 'ఇది పెద్ద ప్రశ్న. దానికి మీరు పెట్టే పేరు ఏమిటి (మహా కూటమినా)? ఉత్తరప్రదేశ్ ప్రజలు బీజేపీని గద్దె దించుతారని మాత్రం చెప్పగలను. దేశ ప్రజలు అధికార మార్పును కోరుకుంటున్నారు' అని అఖిలేశ్ బదులిచ్చారు. తమ పార్టీ ప్రతిపక్షాలతో కలిసి ముందుకు వెళుతుందా లేదా అన్నది మాత్రం వెల్లడించలేదు.

రాహుల్ కేసు విచారణ న్యాయంగా లేదు

సూరత్ కోర్టులో న్యాయవాది చీమా వాదనలు

సూరత్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపె 'మోదీ' ఇంటిపేరు నేపథ్య పరువు నష్టం కేసులో తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సూరత్ సెషన్స్ కోర్టు గురువారం విచారించింది. రాహుల్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ విచారణ న్యాయంగా జరగలేదని, ఆయనకు గరిష్ఠ శిక్ష విధించాల్సిన అవసరం లేదన్నారు. మార్చి 23న సూరత్‌లోని మెట్రోపాలిటన్ కోర్టు రాహుల్ గాంధీని దోషిగా నిర్ధారించి రెండేళ్ల జైలుశిక్ష విధించింది. స్టే కోరుతూ రాహుల్ ఫిర్యాదు చేసుకోగా ఆయనపై కేసు పెట్టిన బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ స్పందిస్తూ పదేపదే తప్పుచేసే వ్యక్తికి ఎలాంటి ఊరట కల్పించరాదని కోర్టును కోరారు. గురువారం రెండు వైపుల వాదన లను అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆర్పీ మొగేరా విన్నారు. రాహుల్ తరపున సీనియర్ న్యాయవాది ఆర్ఎస్ చీమా వాదనలు వినిపించారు. విచారణ న్యాయంగా జరగలేదని, ట్రయిల్ కోర్టు జడ్జి వైఖరి విచిత్రంగా తోచిందని అన్నారు. ఎలక్ట్రానిక్ పరికరం ఆధారంగా కేసు మొత్తం సాగింది. ఎన్నికలప్పుడు రాహుల్ మాట్లాడిన చోటునకు 100కిమీల దూరంలో ఉన్న వ్యక్తి న్యూస్ చూసి కేసు పెట్టారు. ఈ కేసులో గరిష్ఠ శిక్ష విధించాల్సిన అవసరం లేదు' అని చీమా వాదించారు. రఫేల్ వ్యవహారంలో రాహుల్ బేషరతుగా క్షమాపణ చెప్పగా దానిని తప్పుడు విధంగాఈ కేసుతో ముడిపెట్టే ప్రయత్నం ఆక్షేపణీయమన్నారు. న్యాయమూర్తి తప్పుదారి పట్టించారని చీమా వినిపించారు. రాహుల్ వయనాడ్ నుంచి రికార్డు ఓట్లతో గెలిచి ఇప్పుడు దోషిగా లోక్‌సభలో అనర్హతవేటుకు గురయ్యారని, ఇది కోలుకోలేని దెబ్బ అని అన్నారు. రాహుల్ ప్రసంగం సందర్భోచితమని, దానిని భూతద్దంలోంచి చూపితే తప్ప పరువు నష్టం కలిగించేదిగా ఉండదన్నారు. ప్రధానిని విమర్శించినందుకు ఆయనపై కేసు పెట్టారని, ట్రయిల్ కోర్టు జడ్జి విచారణను తప్పుదారి పట్టించారని, ఇది అన్యాయమన్నారు. పూర్ణేశ్ మోదీ తరపు న్యాయవాది హర్షిత్ తోలియా వాదిస్తూ మోదీ ఇంటి పేరు ఉన్నవారందని ఉద్దేశించి రాహుల్ వ్యాఖ్యలు చేసినందున తన క్లయింట్ ఇబ్బంది పడ్డారన్నారు. గతంలో ఈ అంశాన్ని లేవనెత్తకపోయినా ఇప్పుడు లేవనెత్తామని వాదించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.